RNI NO: APBIL/2015/67544

# సువార్త
SUVAARTHA

సమగ్ర రాజకీయ, సామాజిక, ఆధ్యాత్మిక వార్తపత్రిక

సంపుటి : 11 సంచిక :41, సంపాదకులు: Ch.I ప్రశాంత్ కుమార్ ఆగస్టు 24 నుంచి 30 వరకు 2026 పేజీలు:8, వెల:రూ. 5/.

## ఏపీ 'ఏఐ' మోడల్ భేష్..!

అమరావతి,(సువార్త ప్రతినిధి): పన్నుల నిర్వహణ ఒక క్లిష్టమైన ప్రక్రియ..! ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వచ్చాక.. ఈ ప్రక్రియ చాలా సులభమైపోయింది. కొన్ని వారాలపాటు పట్టే పనులు సైతం గంటల్లోనే పూర్తవుతున్నాయి. ఖజానాకు ఆదాయం కూడా వస్తోంది. అందుకే ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖ రూపొందించిన ఏఐ ఆధారిత జీఎస్టీ పరిపాలన మోడల్ దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోందని ప్రభుత్వం శుక్రవారం తెలిపింది. పన్ను ఎగవేతలను అరికట్టడం, పన్ను వసూళ్లను పారదర్శకం చేయ డం, పన్ను చెల్లింపుదారుల సేవలను మెరుగుపరచడంలో ఏఐని వాడుతున్న తీరును పలు రాష్ట్రాలు అభినందించినట్లు పేర్కొంది. వాణిజ్య పన్నుల విభాగంలో ఏఐ వాడకంపై రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మోడల్‌ను ఇటీవల కేంద్ర రెవెన్యూ కార్యదర్శి సమక్షంలో ప్రదర్శించారు.

## అమరావతిలో ఎంట్రీకి అందుబాటులోకి రానున్న మరిన్ని రహదారులు.. మంత్రి సమీక్ష

అమరావతి, (సువార్త ప్రతినిధి): రాజధాని అమరావతిలో ఎంట్రీకి మరిన్ని రహదారులను త్వరితగతిన అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందులో భాగంగా సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభంతో ఇతర రహదారుల కనెక్టివిటీపై మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి నారాయణ దృష్టి సారించారు. గురువారం జు 13, జు 15, జు 1, జు 3 రహదారి నిర్మాణ పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.మంగళగిరి నుంచి అమరావతికిలోకి ప్రవేశించే జు 15 రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రికి అధికారులు వివరించారు.16వ నెంబర్ జాతీయ రహదారి నుంచి ఎయిమ్స్ ద్వారా అమరావతిలోకి జు 13 రోడ్డు ప్రవేశించనుంది.

# దక్షిణాది రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం కావాలి




**పునర్విభజనపై ముఖ్యమంత్రుల డిమాండ్**

**పునర్విభజనతో రాజకీయ బలం తగ్గకూడదన్న ముఖ్యమంత్రులు**

**నీట్, నదీ జలాలు, ఆర్థిక స్వయం ప్రతిపత్తిపైనా చర్చ**

చెన్నై,(సువార్త ప్రతినిధి): దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక ప్రగతికి తగినట్టుగా రాజకీయ ప్రాతినిధ్యం, కేంద్ర నిధుల్లో న్యాయమైన వాటా, మౌలిక సదుపాయాల అభివృద్ధి, జాతీయ విధానాల రూపకల్పనలో మరింత ప్రాధాన్యం కల్పించాలని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు కోరారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన తమిళనాడులో జరిగిన దక్షిణ మండల మండలి సమావేశంలో పలు కీలక అంశాలపై రాష్ట్రాలు తమ అభిప్రాయాలను వెల్లడించాయి.

నియోజకవర్గాల పునర్విభజన, నీట్ పరీక్ష, కావేరీ జలాల వివాదం, మేకెదాటు ప్రాజెక్టు, గోదావరి–కావేరీ నదుల అనుసంధానం, రాష్ట్రాల ఆర్థిక స్వయంప్రతిపత్తి, తీర ప్రాంత భద్రత, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి.

**పునర్విభజనతో దక్షిణాది ప్రాతినిధ్యం తగ్గొద్దు: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్**

నియోజకవర్గాల పునర్విభజన అంశంపై దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేశాయి. జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలకు కొత్త పునర్విభజన వల్ల లోక్‌సభలో రాజకీయ ప్రాతినిధ్యం తగ్గే పరిస్థితి రాకూడదని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అభిప్రాయపడ్డారు. జనాభా నియంత్రణ, మానవ అభివృద్ధి, విద్య, వైద్యం వంటి రంగాల్లో దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని, ఈ విజయానికి ప్రతిఫలంగా రాజకీయ ప్రాతినిధ్యం తగ్గడం న్యాయం కాదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్యను కొనసాగిస్తూ, మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని కూడా డిమాండ్ చేశారు.

**నీట్‌పై తమిళనాడు అభ్యంతరం**

వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న నీట్ పరీక్షపైనా తమిళనాడు అభ్యంతరం వ్యక్తం చేసింది. గ్రామీణ ప్రాంతాలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఈ పరీక్ష ఇబ్బందులు కలిగిస్తోందని రాష్ట్రం వాదించింది. తమిళనాడుకు నీట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, రాష్ట్ర కోటాలో వైద్య విద్య ప్రవేశాలను పాఠశాల విద్యలో సాధించిన మార్కుల ఆధారంగా కల్పించే అవకాశం ఇవ్వాలని కోరింది. వైద్య విద్య అందరికీ సమానంగా అందేలా విధానాలను రూపొందించాలని రాష్ట్రం అభిప్రాయపడింది.

**543 స్థానాలపై కర్ణాటక ముఖ్యమంత్రి శివకుమార్ డిమాండ్**

కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా పునర్విభజన అంశాన్ని బలంగా ప్రస్తావించారు. 1971 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవాలని, ప్రస్తుత 543 లోక్‌సభ స్థానాలను మరో 25 ఏళ్లపాటుకొనసాగించాలని కోరారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించినా ప్రస్తుత స్థానాల సంఖ్యను పెంచకుండా అదే పరిధిలో అమలు చేయాలని ప్రతిపాదించారు. జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు విజయవంతమైనందుకు వాటి రాజకీయ ప్రాధాన్యం తగ్గకూడదని శివకుమార్ అన్నారు. ఆర్థికంగా రాష్ట్రాలు అందిస్తున్న వాటాకు అనుగుణంగా జాతీయ స్థాయిలో రాజకీయ ప్రాతినిధ్యం కూడా ఉండాలని స్పష్టం చేశారు.

**దక్షిణాది ప్రాంతీయ అభివృద్ధికి కలిసి పనిచేయాలి: తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి ప్రయోజనాలు, ప్రాంతీయ అభివృద్ధి కోసం పరస్పర సహకారాన్ని మరింత పెంచుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సమన్వయం బలోపేతం చేయడం ద్వారా దేశ అభివృద్ధికి మరింతగా దోహదపడవచ్చని పేర్కొన్నారు. ప్రాంతీయంగా ఎదురవుతున్న ఉమ్మడి సమస్యలను రాష్ట్రాలు పరస్పర సహకారంతో పరిష్కరించుకోవాలని భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, రవాణా, భద్రత వంటి అంశాల్లో సమన్వయంతో ముందుకు సాగితే దక్షిణాది ప్రాంతం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు.

తెలంగాణ ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాల మధ్య సహకారాన్ని బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రాల మధ్య మెరుగైన సమన్వయం దేశాన్ని మరింత బలమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కేంద్రం, రాష్ట్రాలు కలిసి పనిచేయడం ద్వారా ప్రాంతీయ అభివృద్ధితో పాటు జాతీయ ప్రగతికి కూడా మరింత ఊతం లభిస్తుందని భట్టి విక్రమార్క అన్నారు.

## లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.38 కోట్లు ఇవ్వాలి..



**50 వేల ఎకరాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి..**

**అసెంబ్లీలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్**

అమరావతి (సువార్త ప్రతినిధి): పెదకూరపాడు నియోజకవర్గంలోని లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల మరమ్మతులకు అవసరమైన నిధులను ప్రభుత్వం వెంటనే కేటాయించి, సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. గురువారం అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో జీరో అవర్‌లో నియోజకవర్గంలోని సాగునీటి సమస్యలను ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గంలోని 28 లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు మరమ్మతులకు గురయ్యాయని తెలిపారు. ప్రాజెక్టులు సక్రమంగా పనిచేయక పోవడంతో పంట పొలాలకు సకాలంలో సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో దాదాపు 90 శాతం గ్రామీణ ప్రాంతమే ఉందని, అధికశాతం ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులకు సకాలంలో సాగునీరు అందించి, పంటలు మంచి దిగుబడులు సాధించేలా చేయడం ద్వారా గ్రామీణ ప్రాంతాల ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయవచ్చని అన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, అదే స్ఫూర్తితో నియోజకవర్గంలోని 28 లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల మరమ్మతులకు రూ.38 కోట్లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## శాసనమండలిలో మంత్రి లోకేశ్ ప్రవేశపెట్టిన 5 బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం

**శాసనమండలిలో 5 కీలక బిల్లులు ప్రవేశపెట్టిన మంత్రి లోకేశ్**


**విద్యా, గ్రంథాలయ, నైపుణ్య రంగాలకు సంబంధించిన బిల్లులు**

**ఆమోదం పొందిన వాటిలో ప్రైవేటు స్కిల్ వర్సిటీల బిల్లు కూడా ఉంది**



అమరావతి(సువార్త ప్రతినిధి):ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో పలు కీలక బిల్లులకు ఆమోదం లభించింది. రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ 5 ముఖ్యమైన బిల్లులను సభలో ప్రవేశపెట్టగా, మండలి వాటిని ఏకగ్రీవంగా ఆమోదించింది. విద్యా, గ్రంథాలయ, నైపుణ్యాభివృద్ధి రంగాలలో సంస్కరణల లక్ష్యంగా ప్రభుత్వం ఈ బిల్లులను రూపొందించింది.నేడు జరిగిన శాసనమండలి సమావేశంలో మంత్రి లోకేశ్ ఈ బిల్లులను సభ ముందు ఉంచారు. మండలి ఆమోదించిన బిల్లులలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ గ్రంథాలయాల సవరణ బిల్లు–2026, ఏపీ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ సవరణ బిల్లు ఉన్నాయి.వీటితో పాటు ఏపీ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాసంస్థల (ఉపాధ్యాయుల కేడర్ లో రిజర్వేషన్) సవరణ బిల్లులను కూడా సభ ఆమోదించింది. రాష్ట్రంలో కొత్తగా ప్రైవేటు నైపుణ్య విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేసేందుకు ఉద్దేశించిన ఏపీ ప్రైవేటు నైపుణ్య విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ బిల్లుకు కూడా మండలి ఆమోదముద్ర వేసింది. ఈ బిల్లులకు సభ్యులందరూ మద్దతు తెలపడంతో ఏకగ్రీవంగా ఆమోదం పొందినట్లు ప్రకటించారు.

## ఏపీలో మిలాద్–ఉన్–నబి సెలవు తేదీ మార్పు..




అమరావతి, (సువార్త ప్రతినిధి): మిలాద్–ఉన్–నబి పండుగకు సంబంధించిన సెలవు తేదీని మారుస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముందుగా ప్రకటించిన ఆగస్టు 25కు బదులుగా ఆగస్టు 26వ తేదీని(బుధవారం) సాధారణ సెలవు దినంగా ప్రకటించింది. చంద్ర దర్శనం ఆధారంగా ఈ ఏడాది మిలాద్–ఉన్–నబి పండుగ ఆగస్టు 26న వస్తుందని ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డు ప్రభుత్వానికి తెలియజేసింది. సెలవు తేదీని సవరించాలని వక్ఫ్ బోర్డు సీఈఓ చేసిన విజ్ఞప్తి మేరకు సెలవు తేదీని సవరిస్తూ నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 26ను సాధారణ సెలవు దినంగా ప్రకటిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జె. శ్యామల రావు అధికారికంగా జీవో జారీ చేశారు.

## సీఎం చంద్రబాబు ఆదర్శ పాలన అందిస్తున్నారు: ఎంపీ శ్రీభరత్



విశాఖపట్నం,(సువార్త ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్యక్ష పద్ధతిలో జడ్పీ ఎన్నిక జరగాలంటూ ఏపీ కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని ఎంపీ శ్రీభరత్ అభినందించారు. ఈరోజు(గురువారం) విశాఖ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఎంపీ తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలు ప్రశాంతంగా ఉన్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారని కొనియాడారు.

## రంగంలో ఏడు నౌకలు



**అన్ని వనరులతో జల్లెడ జాలర్లు జాడ దొరికే వరకూ..**

**భారీ అన్వేషణ ల ఆపరేషన్ 7 నేవీ, కోస్ట్‌గార్డ్ నౌకలతో గాలింపు**

**డోర్నియర్ విమానాలు, నేవీ హెలికాప్టర్‌తో గగనతలం నుంచి సెర్చ్ హల్దియా, పారాదీప్ కోస్ట్‌గార్డ్ కేంద్రాలు కూడా రంగంలోకి**

**మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

అమరావతి(సువార్త ప్రతినిధి): ఓడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు చెందిన బోటులో చేపల వేటకు వెళ్లి అదృశ్యమైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం భారత నౌకాదళం, భారత తీర రక్షక దళం సమన్వయంతో సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్‌ను మరింత ముమ్మరం చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మత్స్యకారులను సురక్షితంగా వెనక్కి తీసుకురావడమే లక్ష్యంగా సముద్రం, గగనతలం నుంచి విస్తృతంగా గాలిస్తున్నామని చెప్పారు. ఆగస్టు 3న ఏడుగురు మత్స్యకారులతో బోటు చేపల వేటకు వెళ్లిందని, నిర్ణీత సమయానికి తిరిగి రాకపోవడంతో సమాచారం అందిన వెంటనే సంబంధిత శాఖలను అప్రమత్తం చేసి గాలింపు చర్యలు ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ఆగస్టు 17 నుంచి భారత తీర రక్షక దళానికి చెందిన ఐదు నౌకలు గాలింపు చర్యల్లో పాల్గొంటుండగా, భారత నౌకాదళం మరో రెండు నౌకలను రంగంలోకి దించడంతో ప్రస్తుతం మొత్తం ఏడు నౌకలు సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొంటున్నాయని వెల్లడించారు.

# సంపాదకీయం

## నవీన కాలానికి నవ జాతీయగీతం!

సదా కొత్తదనాన్ని ఆవాహన చేసుకోవడమే జీవ ధర్మం. మన కాలానికి అవసరమైన ఒక కొత్త జాతీయ గీతాన్ని సృజించాలని యువభారతీయులకు గుల్జార్ పిలుపునిచ్చారు. దేశం 80వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు జరుపుకున్న మరో మూడు రోజులకు గుల్జార్ 92వ ఏట ప్రవేశించారు. 'జనగణమన' లేదా 'వందేమాతరం' స్థానాన్ని భర్తీ చేసేందుకు కాకుండా సమకాలీన విభజనవాద రాజకీయాలను త్రోసిపుచ్చి, జాతిజీవనంలోని అపార వైవిధ్యాన్ని గౌరవించే ఒక అనుబంధ జాతీయ గీతాన్ని సృష్టించాల్సిన అవసరమున్నదని గుల్జార్ విజ్ఞప్తి చేశారు. తాము భారతీయులమనే ప్రగాఢ ఐక్యతా భావాన్ని పెంపొందించే ఒక కొత్త దేశభక్తి గీతాన్ని సృజించుకోవాలని అన్నారు. వర్తమాన భారతదేశం గొప్పదనాన్ని కీర్తించడంలో దశాబ్దాల నాటి పాత పాటలపై ఆధారపడకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. సమకాలీన భారతీయ సమాజంలోని విభిన్న స్వరాలను ప్రతిబింబించేలా జాతీయ అస్తిత్వాన్ని పునర్ నిర్వచించుకోవాలని గుల్జార్ అన్నారు. తన కొత్త గీతం 'ఏక్ అకేలా హిందుస్థానీ, దో మిలే తో హిందుస్థాన్' వీడియో విడుదల సందర్భంగా గుల్జార్ ఆ విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి సాంస్కృతిక వైవిధ్యం ద్వారా ఆత్మీయత, ఐక్యతా భావాన్ని శ్రోత మనసులో నెలకొల్పే 'మిలే సుర్ మేరా తుమ్హారా' లాంటి గీతమది.

గుల్జార్‌కు ప్రగాఢ అభిమానినే అయినప్పటికీ ఆయన సృజించిన 'ఏక్ అకేలా హిందుస్థానీ' ఇప్పుడు మనకు అవసరమైన కొత్త దేశభక్తి గీతం అని నేను భావించడం లేదు. అలా భావించాలని కవి కూడా కోరుకోలేదు. మన కాలానికి అవసరమైన కొత్త దేశభక్తి గీతాన్ని సృష్టించమని యువ భారతీయులను ఆయన ఆహ్వానించారు. ఆనందప్రదమైన విషయమేమిటంటే రవీంద్రుని 'జనగణమన' గానీ, బంకించంద్ర 'వందేమాతరం' గానీ తమ ప్రేరణాత్మక గుణాన్ని కోల్పోలేదు, కోల్పోవు కూడా. ఆ అజరామర గీతాల విశిష్ట చారిత్రక ప్రస్థానాన్ని టి.ఎమ్.కృష్ణ తన ఇటీవలి పుస్తకం 'ఔవఽష్ట్రమూవశీజూశ్రీవ శీట ×అఽఱఖః ణవఎశీఽఱఅస్త్రూా చీఫ్‌ఱశీఅ'ం ాఎఎశీశ్రీం'లో విపులంగా వివరించారు. నా తరం భారతీయులు 'జనగణమన' వినపడగానే గౌరవపూర్వకంగా లేచి నిలబడేవారు. ఆ ఆచారం కాలం గడుస్తున్న కొద్దీ కొత్త అర్థాలను సంతరించుకున్నది. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉద్యమింప చేయడంలో ఆ అధికారిక జాతీయ గీతం అశేష ప్రజలకు ఎనలేని స్ఫూర్తినిచ్చింది. బంకించంద్ర 'వందేమాతరం' కూడా అంతే స్ఫూర్తిదాయకమైనది. ఆకాశవాణి విన్పించే 'వందేమాతరం' కాకుండా 'ఆనంద్ మఠ్' సినిమాలోని పాటే నాకు బాగా నచ్చింది. ఈ రెండు గీతాలూ పవిత్రమైనవి, ఉత్కృష్టమైనవి, అన్ని సందర్భాలలోను ఆలాపించేందుకు యుక్తమైనవి.

దేశభక్తి గీతాల పట్ల అనురక్తి, గౌరవభావం నిండుగా వ్యక్తమైన భారతదేశంలో నేను పెరిగాను. ఇక్బాల్ 'సారే జహాన్ సే అచ్ఛా, హిందుస్థాన్ హమారా'ను విస్మరించగలమా? స్వాతంత్ర్యోద్యమం నుంచి మనకు వారసత్వంగా సంక్రమించిన ఉదాత్తగీతమది. భారత జాతీయవాదం సంకుచితమైనదికాదు. మన పొరుగుదేశం, శత్రు రాజ్యం పట్ల వ్యతిరేక భావాలను పురిగొల్పేదికాదు. 'జో జిసాసే మిలా సీఖా హమ్నే/గైరోంకో భీ అప్నాయ హమ్నే' (కలిసిన ప్రతి ఒక్కరి నుండి నేర్చుకున్నాం, అపరిచితులను కూడా సొంతవారిగా స్వీకరించాం) అన్న విశ్వ దృక్పథంతో మన జాతీయవాదం భారత్‌ను విశిష్టంగా నిర్వచించింది. 1960లు, 1970ల్లోని మా బోటి పిల్లలకు 'ఆవో బచ్చో తుమ్హే దిఖాయే', 'హమ్ లాయేహై తూఫాన్ సే' మొదలైన దేశభక్తిగీతాలు ఆదర్శవంతమైన దేశాన్ని నిర్మించాలని ప్రబోధించాయి. మంచి పౌరులుగా ఎదిగేందుకు అవి స్ఫూర్తినిచ్చాయి. ఇక్బాల్ అజరామర గీతంలోని 'మజ్హబ్ నహీ సిఖాతా ఆపస్ మే బైర్ రఖ్నా' (ఒకరి పట్ల ఒకరు ద్వేషాన్ని పెంచుకోవాలని మతం బోధించదు) అన్న సత్యాన్నే సాహిర్ సుప్రసిద్ధ సినిమా గీతం 'తూ హిందు బనేగా నా ముసల్మాన్ బనేగా, ఇన్సాన్ కీ ఔలాద్ హై ఇన్సాన్ బనేగా' (ఒక బిడ్డకు ఏ మతం ముద్ర వేయకముందే వారు మొదట మనుషులుగా జన్మిస్తారు)లో కూడా ప్రతిధ్వనించింది. 'అప్నీ అజాదీ కో హమ్ హర్గీజ్ మిటా సక్తే నహీ' మొదలైన పాటలు స్వాతంత్ర్యం విలువను ఉద్ఘాటించాయి, 'సాథీ హాత్ బఢానా', 'చోడో కల్ కీ బాతే' మొదలైనవి జాతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రతి భారతీయుడినీ ఆహ్వానించాయి. తోటి మనుషులకు సేవ చేయడమే దేశాన్ని ఆరాధించడమని నా బాల్యంలో మేము పాడిన దేశభక్తి గీతాలు ఉద్బోధించాయి. ఈ ఉదాత్త భావనే నేను విశ్వసించే జాతీయవాదం. 1962, 1965, 1971 యుద్ధాల చరిత్ర ఆధారంగా నిర్మించిన సినిమా గీతాలు 'ఆయే మేరే వతన్ కే లోగో', 'కర్ చలే హమ్ ఫిదా' మొదలైన గీతాలు కూడా ఉదాత్త దేశభక్తిని ప్రేరేపించాయి గానీ సంకుచిత జాతీయోన్మాదాన్ని రెచ్చగొట్టలేదు. మనోజ్‌కుమార్ ప్రాచుర్యంలోకి తెచ్చిన దేశభక్తి కూడా నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చింది. అది నిరాడంబర దేశభక్తి. మా చిన్నతనంలో సినిమాలు చూడడానికి మా పెద్దలు అనుమతించేవారు కాదు. ప్రస్తావిత గీతాలు అన్నిటినీ తెరపై చూడడం కంటే రేడియో ద్వారానే ఎక్కువగా వింటుండేవాళ్లం. ఇప్పటి దేశభక్తిగీతాలు నాకు అంతగా స్ఫూర్తినివ్వడం లేదు. వాటితో మమేకం కాలేకపోతున్నాను. ఆస్వాదించలేకపోతున్నాను. రాజకీయ స్పృహతో రాసిన కవిత్వం అర్థవంతమైనది. అటువంటి కవితలను తరచు చదువుతుంటాను. ప్రసిద్ధ కవి రఘువీర్ సహాయ్ వ్యంగ్య కవిత 'అధినాయక్' స్వాతంత్ర్యానంతరం కూడా సామాన్య ప్రజల దుస్థితి మారలేదని అధిక్షేపించింది. వినోద్ కుమార్ శుక్లా 'లగ్భగ్ జైహింద్' దేశభక్తి సూత్రాలకు, వాస్తవ మానవ శ్రేయస్సుకు మధ్య ఉన్న అంతరాన్ని బహిర్గతం చేసింది. సర్వేశ్వర్ దయాళ్ సక్సేనా, దుష్యంత్ కుమార్ కవితలు ప్రజల నిరాశా నిస్పృహలను ప్రభావశీలంగా వ్యక్తం చేశాయి. ఉదాత్త దేశభక్తిగీతాల కోసం నా అన్వేషణ నన్ను ఫైజ్ అహ్మద్ ఫైజ్, ఇక్బాల్ బానో కవిత్వానికి తీసుకువెళ్లాయి. జనప్రియ హిందీ గీతాలు, పాటలకు నా పఠనాసక్తులలో చోటు లేదు. అలా అని నేను వాటిని వినకపోలేదు. 'చక్ దే ఇండియా' నా హృదయాన్ని తాకింది. 'సందేశే ఆతే హై' స్ఫూర్తిదాయక గీతమే కానీ 'కర్ చలే హమ్ ఫిదా'లా భావావేశం కలిగించేది కాదు. 'యే జో దేశ్ హై తేరా' అనుభూతించడానికి అవసరమైన ప్రవాస జీవితానుభవాలు నాకు లేవు. 'మా తుఝే సలామ్' సంగీత బాణీ అత్యాధునికంగా ఉంటుంది. అయితే ఆ చరణాలలోని భాష పాత శైలిలో ఉంటుంది.

# తెలుగు రాష్ట్రాల్లో సెలవు తేదీ మార్పు..

# మిలాద్ ఉన్ నబీ ఎప్పుడంటే..?

**ఏపీలో మిలాద్ ఉన్ నబీ సెలవు తేదీ మార్పు**

**గతంలో ఆగస్టు 25న సెలవుగా ప్రకటన**

**తాజాగా ఆగస్టు 26, బుధవారానికి సెలవు మార్పు**

**ముస్లిం మత పెద్దల అభ్యర్థన మేరకు నిర్ణయం**

**తెలంగాణలోనూ ఆగస్టు 26నే మిలాద్ ఉన్ నబీ**



(సువార్త ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌లో మిలాద్ ఉన్ నబీ ప్రభుత్వ సెలవు తేదీని మార్చారు. గతంలో ఆగస్టు 25న సెలవుగా ప్రకటించగా.. తాజాగా ఆగస్టు 26, బుధవారానికి మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముస్లిం మత పెద్దల అభ్యర్థన, నూతన చంద్ర దర్శనాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు.తెలంగాణ ప్రభుత్వం కూడా మిలాద్ ఉన్ నబీ సెలవును ఆగస్టు 26కే ఖరారు చేసింది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఒకే రోజు ఈ పండగకు ప్రభుత్వ సెలవు అమల్లో ఉండనుంది.

# తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ..

# దర్శనానికి 18 గంటల సమయం



**శిలాతోరణం వరకు విస్తరించిన సర్వదర్శనం క్యూలైన్లు**

**నిన్న స్వామివారిని దర్శించుకున్న 76,464 మంది భక్తులు**

**హుండీ ద్వారా రూ. 4.94 కోట్ల ఆదాయం**

(సువార్త ప్రతినిధి): తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ పూర్తిగా నిండిపోవడంతో, సర్వదర్శనం క్యూలైన్లు వెలుపల వరకు విస్తరించాయి. ప్రస్తుతం క్యూలైన్లు శిలాతోరణం వరకు చేరుకోవడంతో తిరుమల కొండపై భక్తుల రద్దీ ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతోంది.టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు శ్రీవారి దర్శనం లభించేందుకు సుమారు 18 గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉంటున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. భక్తులకు తాగునీరు, అల్పాహారం వంటి సౌకర్యాలను సిబ్బంది నిరంతరం పంపిణీ చేస్తున్నారు.మరోవైపు, నిన్న (బుధవారం) శ్రీవారిని మొత్తం 76,464 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో 36,913 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. ఒక్కరోజే శ్రీవారి హుండీ ద్వారా రూ. 4.94 కోట్ల ఆదాయం సమకూరినట్లు టీటీడీ అధికారులు తెలిపారు. వారాంతం సమీపిస్తుండటంతో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# విశాఖలో దారుణం.. తరగతి గదిలో కుప్పకూలిన బాలుడు



విశాఖపట్నం,(సువార్త ప్రతినిధి): విశాఖలో దారుణం జరిగింది. టీచర్ కొట్టడంతో తరగతి గదిలోనే ఆరేళ్ల బాలుడు ప్రణయ్ తేజ్ కుప్పకూలిపోయాడు. విశాఖ వన్‌టౌన్ ప్రాంతంలోని లిటిల్ గార్డెన్ స్కూల్‌లో ఈ ఘటన జరిగింది. అపస్మారకస్థితిలోకి వెళ్లిన బాలుడిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే బాబు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో అక్కడి నుంచి చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. విషయం తెలిసిన వెంటనే తల్లిదండ్రులు, బంధువులు స్కూల్ వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. హోంవర్క్ చేయలేదని టీచర్ మందలించడంతో పాటు దాడి చేయడం కారణంగానే ప్రణయ్ మరణించాడని బంధువులు ఆరోపిస్తున్నారు. కేజీహెచ్‌లో బాలుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చిన్నారిని కొట్టిన టీచర్‌తో పాటు స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

# 'సర్' అభ్యంతరాల పరిష్కారంపై దృష్టి

**22, 23, 29, 30 తేదీల్లో పోలింగ్ బూత్‌లలో అందుబాటులో బీఎల్‌ఓలు**

**స్వీకరించిన పత్రాల అప్‌లోడ్ తప్పనిసరి**

**డీఈఓలతో సమీక్షలో సీఈఓ వివేక్**




అమరావతి,(సువార్త ప్రతినిధి): ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ(సర్) ముసాయిదా ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, క్లెయిమ్‌ల పరిష్కారం, నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయడం దృష్టి సారించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ ఆదేశించారు. ఆయన, అదనపు సీఈవో ఢిల్లీరావుతో కలసి అమరావతి సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారుల(డీఈఓ)తో వీడి యో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... '22, 23, 29, 30 తేదీలు రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులు(బీఎల్‌వోలు), రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు(బీఎల్‌ఏలు) అందుబాటులో ఉంటారు. వివిధ ప్రక్రియల్లో ఓటర్లకు సహాయ సహకారాలను అందిస్తారు. వాటిని వేగవంతం చేస్తారు. క్లెయిములు, అభ్యంతరాల పరిష్కారంలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు(ఈఆర్‌వోలు) క్వాజీ జుడీషియల్ అధికారాలను సరిగ్గా ఉపయోగించి, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలి. విచారణల సమయంలో ఓటర్లు సమర్పించే పత్రాలను బీఎల్‌వో యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. ఫారం-9, 10, 11, 11ఏలో నమోదైన క్లెయిములు, అభ్యంతరాల జాబితాలను రోజువారీగా సీఈవో వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి, వారానికోసారి రాజకీయ పార్టీలకు ఇవ్వాలి. ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ఓటర్ల నమోదును గరిష్ఠస్థాయికి తీసుకెళ్లాలి' అని సీఈవో అన్నారు. అనంతరం అదనపు సీఈవో ఢిల్లీరావు మాట్లాడుతూ.. 'ఓటర్లు ఇచ్చిన లేదా బీఎల్‌వోలు సేకరించిన పత్రాలను బీఎల్‌వో యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. యాప్‌ను తప్పనిసరిగా వినియోగించాలి. ఆమేరకు జిల్లా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలి. ఏఈఆర్‌వోలకు గ్రామాలు, పోలింగ్ కేంద్రాలను సక్రమంగా కేటాయించాలి. విచారణల సమయంలో అప్‌లోడ్ చేసిన పత్రాల ధృవీకరణకు జిల్లా ఎన్నికల అధికారులకు సమాంతర లాగిన్‌ను ఏర్పాటు చేశాం' అని తెలిపారు.

# ప్రియాంక కేసులో వైసీపీ ఓవరాక్షన్!



రాజమహేంద్రవరం, (సువార్త ప్రతినిధి):డాక్టర్ ప్రియాంక మరణం కేసులో బాధిత కుటుంబానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇలాంటి సమయంలోనూ వైసీపీ నాయకులు మాత్రం యథావిధిగా ఓవరాక్షన్ చేస్తున్నారు! తమదైన శైలిలో 'శవ రాజకీయం' చేయడం మానుకోలేదు!! రాజమండ్రి మాజీ ఎంపీ భరత్ ప్రియాంక తల్లిదండ్రులను జగన్ వద్దకు తీసుకెళ్లడం విమర్శలకు తావిస్తోంది. కేసు దారి మళ్లకుండా ప్రభుత్వం దర్యాప్తు బాధ్యతలను అడిషనల్ ఎస్పీకి అప్పగించడంతో పాటు బాధిత కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందించింది. హైదరాబాద్‌లోని ఆస్పత్రి బిల్లులను సైతం చెల్లించింది. అండ గా ఉంటామని భరోసా ఇచ్చింది. అటు ప్రియాంక పీజీ చదువుతున్న జీఎ?సఎల్ ఆస్పత్రి కూడా రూ.20 లక్షల ఆర్థిక సహాయంతో పాటు తమకు చెల్లించిన ఫీజులను వెనక్కు ఇచ్చేసింది. నిందితులకు ఎట్టి పరిస్థితుల్లోనూ కఠిన శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఇప్పటికే పోలీసులను ఆదేశించారు.

సీన్ రీకన్‌స్ట్రక్షన్.. నిందితుల విచారణ

కేసు తీవ్రత, దర్యాప్తు అధికారిగా ఉన్న సీఐపై ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) పాటిల్ దేవరాజ్ మనీష్‌ను ఐవోగా నియమించింది. ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత మీడియా సమావేశం ఏర్పాటు చేసి.. నిందితులను వెనకేసుకొచ్చే విధం గా మాట్లాడిన డీఎస్పీని దర్యాప్తుకు దూరంగా ఉంచారు. బుధవారం నిందితులను ఘటనాస్థలికి తీసుకెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. కేసును తారుమారు చేయడానికి అధికార పార్టీకి చెందిన ఓ సీనియర్ నాయకుడి కుమారుడు ప్రయత్నం చేశాడని, భారీగా సొమ్ము చేతులు మారిందన్న ఆరోపణల కోణంలోనూ దర్యాప్తు సాగుతోంది. ఈ కేసులో పోలీసులపై ముందు నుంచీ పెద్దఎత్తున ఆరోపణలు ఉన్నాయి. దర్యాప్తులో భాగంగా ప్రకాశంనగర్ సీఐ, డీఎస్పీని కూడా ఐవో ప్రశ్నించే అవకాశం ఉంది.

# గ్రామీణ మహిళలకు 1.28లక్షల కోట్ల లబ్ధి



(సువార్త ప్రతినిధి): రాష్ట్రంలో గ్రామీణ మహిళలకు 2024 జూన్ నుంచి ఇప్పటివరకు రూ.1.28లక్షల కోట్ల లబ్ధి చేకూర్చినట్లు సెర్ఫ్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శాసన మండలిలో వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్తూ, బ్యాంక్ లింకేజీ ద్వారా 5.99లక్షల స్వయం సహాయక సంఘాలకు రూ.71.307కోట్లు, ఉన్నతి పథకం కింద 88,655 మందికి రూ.540కోట్లు, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కింద 37.59లక్షల మందికి రూ.40,084కోట్లు, స్త్రీనిధి బ్యాంకు కింద రూ.16.70లక్షల మందికి రూ.13,116కోట్లు, సీవీఎఫ్ కింద రూ.1.25లక్షల మందికి రూ.641కోట్లు, ఎంటర్ ప్రైజ్ ఫైనాన్స్ కింద లక్షా 3వేల మందికి రూ.2,887కోట్లు ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు.

# వినికిడి లోపం విద్యార్థుల డిగ్రీ కాలేజ్ అడ్మిషన్లు!



బాపట్ల, (సువార్త ప్రతినిధి) : వినికిడి లోపం విద్యార్థుల డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు ఈనెల 23వ తేదీ నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఎస్.వెంకటరవణప్ప తెలిపారు. వారి కోసం రాష్ట్రంలోనే మొదటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బాపట్ల జిల్లా వెదుళ్లపల్లిలో ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించనున్నట్టు ఒక ప్రకటనలో వివరించారు. 2026-27 విద్యా సంవత్సరంలో 30 సీట్లతో ఏఐ సర్టిఫికేషన్ కోర్సుతో బి.కాం(కంప్యూటర్ అప్లికేషన్స్ ప్రధాన సబ్జెక్టుగా) అందిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తులు సమర్పించవచ్చని, మరిన్ని వివరాలకు 90000 13633, 99483 72899 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

# కంపెనీలకు భూముల కేటాయింపు



అమరావతి, (సువార్త ప్రతినిధి): విశాఖపట్నంలో అదానీ ఇన్‌ఫ్రా ఇండియా లిమిటెడ్ భారీ పెట్టుబడులతో చేపడుతున్న ఏఐ డేటా సెంటర్ ప్రాజెక్టుల అభివృద్ధికి అవసరమైన భూ కేటాయింపులు, సేల్ అగ్రిమెంట్ మార్పులు, జీవీఎంసీ భూమిని లీజుకు ఇవ్వడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనితో పాటు పలు సంస్థలకు భూములు కేటాయించారు. కర్నూలు జిల్లా గుట్టపాడులో ఎకరా రూ. 10 లక్షల చొప్పున అగస్త్య గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు 143.26 ఎకరాలు ఇచ్చారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థకు శ్రీకాకుళం జిల్లా మూలపేటలో 450 ఎకరాల భూమిని కేటాయించడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. విశాఖపట్నం జిల్లా కనమాం గ్రామంలో ఎకరా రూ. 55 లక్షల చొప్పున 15 ఎకరాల భూమిని ఇచ్చారు. అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన భారీ ఉక్కు కర్మాగారాన్ని ఈ నెలలో ప్రారంభించాల్సి ఉండగా.. ఆ గడువు డిసెంబరు వరకు పొడిగించారు. నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం నేలటూరు, పైడాపురం గ్రామాల్లో 680.55 ఎకరాలకు సంబంధించి సెయిల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సంస్థకు అనుకూలంగా సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్‌కు ఆమోదం తెలిపారు. నెల్లూరు జిల్లా వడ్లపూడిలో ఇండస్ట్రియల్ అండ్ వేర్‌హౌసింగ్ పార్క్ ఏర్పాటుకు 372 ఎకరాలు కేటాయించారు.

# పంటల బీమాకు అధికారులను కలవండి



అమరావతి, (సువార్త ప్రతినిధి): రాష్ట్రంలో వరి సాగు రైతులకు పంటల బీమా నమోదు గడువును ఈ నెల 31 వరకు పొడిగించగా, మిగిలిన పంటల రైతులు ప్రాంతాల వారీగా సంబంధిత బీమా కంపెనీలు, స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో తీవ్ర ప్రభావ ప్రాంతాల్లో వంద శాతం బీమాలో నమోదయ్యేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. బీమాలో 16.15 లక్షల హెక్టార్ల విస్తీర్ణం నమోదైందని, అత్యధికంగా అనంతపురం జిల్లాలో 3.66, కర్నూలులో 3.31, శ్రీసత్యసాయిలో 2.31 లక్షల హెక్టార్లు నమోదైనట్లు తెలిపారు. గతేడాది కన్నా రాష్ట్రంలో బీమా విస్తీర్ణం పెరిగిందని, పంటల బీమా నమోదులో జాతీయ స్థాయిలో ఏపీ 5వ స్థానంలో ఉందని పేర్కొన్నారు.

# 15-శాతం పెంచలేం!



అమరావతి, గుంటూరు మెడికల్, (సువార్త ప్రతినిధి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా స్టైపండ్‌ను 15 శాతం పెంచలేకపోతున్నామని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. నిరవధిక సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్ల సంఘం ప్రతినిధులతో ఆయన చర్చించారు. ముందుగా జూనియర్ డాక్టర్లు వారి మూడు ప్రధాన డిమాండ్లను మంత్రికి వివరించారు. వాటిలో స్టైపండ్ పెంపు మినహా మిగిలిన రెండు డిమాండ్ల పట్ల మంత్రి సానుకూలంగా స్పందించారు. జూనియర్ డాక్టర్ల పట్ల సానుభూతి ఉన్నప్పటికీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వల్ల 15 శాతం పెంచలేకపోతున్నామన్నారు. దీనిపై పునరాలోచన చేసి, వెంటనే విధులకు హాజరుకావాలని కోరారు. ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసు పెంపుపై వైద్యులను సంప్రదించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) మార్గదర్శకాల అమలు, దూర ప్రాంతాల్లోని బోధనాసుపత్రుల్లో ఖాళీలు భర్తీకాని పక్షంలోనే నాన్-క్లినికల్ పోస్టులను ఎంఎస్సీ పీహెచ్‌డీ అర్హత కలిగిన వారితో భర్తీ చేయాల్సి వస్తుందని వివరించారు. స్టైపండ్ పెంపు విషయంలో ఇంటర్న్ (హౌస్ సర్జన్ల)లకు ఈ ఒక్క ఏడాదికి 5 శాతం, వచ్చే ఏడాది నుంచి 3 శాతం పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. పీజీ, సూపర్ స్పెషాలిటీ వైద్యులకు ఈ ఏడాది 3 శాతం పెంచుతామన్నారు. అసోసియేషన్‌తో మరోసారి చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జూనియర్ డాక్టర్లు మాత్రం స్టైపండ్ 15 శాతం పెంచాల్సిందేనని పట్టుబట్టి చర్చల నుంచి బయటకు వచ్చేశారు. తమ భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను శుక్రవారం మీడియాకు వెల్లడిస్తామని ఆబ్జుడా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఈశ్వర్ శంకర్ తెలిపారు.

హెల్త్ సెక్రటరీ తీరుపై మంత్రికి ఫిర్యాదు..

హెల్త్ సెక్రటరీ వీరపాండియన్ తీరుపై జూనియర్ వైద్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. చర్చల సమయంలో ఆయన కొంత దురుసుగా ప్రవర్తించారని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. "మీరు ఎంత కాలం సమ్మె చేస్తారో చేయండి... నా పవర్ నేను చూపిస్తాను" అన్నారని తెలుపగా.. హెల్త్ సెక్రటరీతో మాట్లాడి, సమస్యను సరిచేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

రక్తదానంతో నిరసన!

జూనియర్ డాక్టర్లు చేస్తున్న నిరవధిక సమ్మె గురువారానికి 11వ రోజుకు చేరింది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం అన్ని ప్రభుత్వ వైద్య బోధన ఆసుపత్రుల్లో జూనియర్ వైద్యులు స్వచ్ఛంద రక్తదానం చేసి నిరసన తెలిపారు. గుంటూరు జీజీహెచ్‌లో 125 మంది రక్తదానం చేశారు. అనంతరం సమ్మె శిబిరంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన కొనసాగించారు. సమ్మెతో గుంటూరు జీజీహెచ్‌లో ఓపీ, ఐపీ రోగుల సంఖ్య బాగా తగ్గింది. సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు ప్రభుత్వ వైద్యుల సంఘం నేతలు పలువురు మండిపడ్డారు. స్టైపండ్ పెంపుపై ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటన జూడాలను అవమానించే విధంగా ఉందన్నారు. ఇటీవల భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి ఖర్చుచేసిన సొమ్ముతో పోలిస్తే.. స్టైపండ్ పెంపు వల్ల ప్రభుత్వంపై పడే భారం చాలా తక్కువే ఉంటుందని అన్నారు. కానీ.. ప్రభుత్వం తమ ఆర్థిక పరిస్థితి బాగాలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు.

# ఎస్‌సీబీఏ సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా రవిశంకర్ ఎన్నిక




న్యూఢిల్లీ, (సువార్త ప్రతినిధి): సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికల్లో జంధ్యాల రవిశంకర్ ఘన విజయం సాధించారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌లో సీనియర్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన జంధ్యాల రవిశంకర్.. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్ర విద్యను పూర్తి చేసి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్‌ను ప్రారంభించారు. గతంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్లు, గవర్నర్లకు న్యాయ సలహాదారుగా రవిశంకర్ విశేష సేవలు అందించారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు రాజధానుల బిల్లుకు వ్యతిరేకంగా ఏపీ హైకోర్టులో ఆయన వాదనలు వినిపించారు.గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు రాజధానుల బిల్లుకు వ్యతిరేకంగా ఏపీ హైకోర్టులో ఆయన వాదనలు వినిపించారు. 2023 నుంచి సుప్రీంకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న రవిశంకర్ పలు కీలక కేసుల్లో వాదనలు వినిపించారు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా తరఫున సుప్రీంకోర్టులో వాదించారు. తెలంగాణలోనూ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులకు సంబంధించిన పిటిషన్లలో అసెంబ్లీ స్పీకర్ తరఫున జంధ్యాల రవిశంకర్ వాదనలు వినిపిస్తున్నారు.

# టీచర్లు లేక ఆదిలాబాద్ జిల్లా కోసాయి ప్రభుత్వ పాఠశాలకు తాళాలు

తలమడుగు, (సువార్త ప్రతినిధి): మహాభారతంలో ద్రోణాచార్యుడి విగ్రహాన్నే గురువుగా భావించి విలువిద్యలో ప్రావీణ్యం పొందిన ఏకలవ్యుడి కథను తలపించే ఘటన ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని కోసాయి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో జరుగుతోంది. ఈ పాఠశాలకు ఉపాధ్యాయులు లేక కొద్ది రోజులుగా తరగతి గదుల తాళాలు కూడా తీయడం లేదు. కానీ, గురువులు లేకుంటేనేం.. పాఠశాల ఉంది కదా.. అనే రీతిలో కొందరు ఆదివాసీ, గిరిజన విద్యార్థులు రోజూ పాఠశాలకు వస్తున్నారు. పాఠశాల ఆవరణలో కూర్చొని పుస్తకాలు తీసి చదువుకుంటున్నారు. కాసేపు ఆటలు ఆడుకొని తిరిగి తమ ఇళ్లకు వెళ్లిపోతున్నారు.కోసాయి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు, 30 మంది విద్యార్థులు ఉన్నారు. ఆ ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఒకరు రెండు నెలల క్రితం పదవీ విరమణ పొందారు. మరో ఉపాధ్యాయురాలు అనారోగ్యంతో మరణించారు. వీరి స్థానాలను మరొకరితో ఇప్పటిదాకా భర్తీ చేయలేదు. గ్రామంలోని పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని సర్పంచ్ రవి, గ్రామస్థులు ఐటీడీఏ అధికారులకు విజ్ఞప్తి కూడా చేశారు. అధికారులు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం ఓ ఉపాధ్యాయుడిని పంపగా.. వేడుకల అనంతరం ఆ ఉపాధ్యాయుడు వెళ్లిపోయారు. ఇలా ఉపాధ్యాయులు లేక కోసాయి పాఠశాల విద్యార్థులు కొంతకాలంగా పాఠాలకు దూరమైపోయారు.

# భార్య అంత్యక్రియలు జరుగుతుండగానే భర్త మృతి




నంద్యాల, (సువార్త ప్రతినిధి): జిల్లాలోని ఆత్మకూరులో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. శ్రీరామ్ నగర్‌లో నివాసం ఉంటున్న భార్యాభర్తలు ఒకే రోజు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు కన్నీరుమున్నీరవుతున్నారు. అనారోగ్యంతో భార్య లక్ష్మీదేవి మృతి చెందగా.. ఆమె అంత్యక్రియలు నిర్వహిస్తున్న సమయంలోనే భర్త సుబ్బరాయుడికి గుండెపోటు వచ్చినట్లు సమాచారం. వెంటనే కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించగా.. అప్పటికే ఆయన మృతి చెందినట్లు తెలుస్తోంది. భార్య మృతిని తట్టుకోలేక తీవ్ర మనోవేదనకు గురైన సుబ్బరాయుడు గుండెపోటుతో ప్రాణాలు కోల్పోవడంతో విషాదం నెలకొంది. జీవితాంతం ఒకరికి ఒకరు తోడుగా నిలిచిన ఆ దంపతులు చావులోనూ తమ అనుబంధాన్ని వీడలేదంటూ స్థానికులు భావోద్వేగానికి గురవుతున్నారు. భార్య మృతితో కుటుంబంలో నెలకొన్న విషాదం నుంచి తేరుకోకముందే భర్త కూడా మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. శ్రీరామ్ నగర్‌లో ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది.

# నిమ్మ ధర.. భళా



బొల్లాపల్లి(గుంటూరు)(సువార్త ప్రతినిధి): కొంత కాలంగా ధర లేక నష్టాలు చవిచూసిన నిమ్మ రైతులకు ఇప్పుడు ఊరట కలిగింది. బస్తా నిమ్మకాయలు రూ.8 వేలకు విక్రయాలు జరుగుతుండగా.. మార్కెట్‌లో కిలో రూ.వంద నుంచి రూ 150 వరకు ధర పలుకుతున్నాయి. డజను నిమ్మకాయలను రూ.70 వరకు అమ్ముతు న్నారు. ఎల్‌నినో ప్రభావంతో తోటల్లో దిగుబడి తగ్గడంతో నిమ్మ కాయలకు డిమాండ్ పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. ఈ నెలాఖరు నాటికి మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

# ఏపీఏఐఎంఎస్ 2.0




కుప్పం, (సువార్త ప్రతినిధి): రైతులు, పంటల సాగు, వ్యవసాయ పథకాలు, అధికారులు, వ్యవసాయ సేవల సమగ్ర సమాచారాన్ని నిర్వహించడం ఏపీఏఐఎంఎస్ 2.0 ప్రధాన ఉద్దేశం. ఇ-క్రాప్ బుకింగ్, ఆర్ఎ?సకే (రైతు సేవా కేంద్రం) ద్వారా ఏపీఏఐఎంఎస్ వ్యవస్థ సమర్థంగా పనిచేయగలుగుతుంది. ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రేషన్ (ఏపీఎ?ఫఆర్)లో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. ఏడాదిగా ఈ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నా, రైతుల్లో స్పందన తక్కువగా ఉంటోంది. కుప్పం నియోజకవర్గంలో ఇప్పటికి కేవలం 77 శాతం మందే నమోదు చేసుకున్నారు. గత వారం నాటికి కుప్పం మండలంలో 8029 మందికి 5017 మంది, గుడుపల్లెలో 4,990కి 4103, శాంతిపురంలో 5967కి 4626, రామకుప్పం మండలంలో 6751 మందికిగాను 5017 మంది రైతులు రిజిస్టర్ అయ్యారు.

ఇవీ ప్రయోజనాలు

వివిధ పంటలు వేయాల్సిన సమయం, పంట సాగుకు సంబంధించిన సూచనలు, సలహాలు రైతుకు లభిస్తాయి. సాగు చేసిన పంటల రకం, ప్రాంతం, సాగు విస్తీర్ణం వంటి సమాచారం ఆధారంగా వ్యవసాయ ప్రణాళిక రూపకల్పన ప్రభుత్వానికి సులువవుతుంది. పంటలను ఆశించే తెగుళ్లు, పురుగులను చిత్రాల ఆధారంగా విశ్లేషించి, వాటికి తగిన పరిష్కారాలను అధికారులు సూచిస్తారు. ఇక, నీటి కొరత, అవసరం వంటివీ అధికారులు అంచనా వేయవచ్చు. వాతావరణ హెచ్చరికలు జారీ చేయవచ్చు. ప్రభుత్వ పథకాలను డిజిటల్ విధానంలో నిర్వహించి, ఎవరి సాయం లేకుండా నేరుగా రైతులకు లబ్ధి చేకూర్చే వీలు చిక్కుతుంది. ఎక్కడ ఏ పంటకు మార్కెటింగ్ ఉందో, ఏ పంట వేస్తే మార్కెట్టు లభిస్తుందన్న సమాచారమూ ఇవ్వొచ్చు.

# మనసులో మెదిలే భావాలను కళాత్మక రూపంలో వర్ణించేదే కవితలే




భీమవరం, (సువార్త ప్రతినిధి): మనసులో మెదిలే భావాలను కళాత్మక రూపంలో వర్ణించేదే కవిత అని, సమస్త మానవాళి అంగీకరించిన గొప్ప పద్ధతుల్లో కవిత్వం ఒకటని సాహితీవేత్తలు, రచయితలు కలిగొట్ల గోపాలశర్మ, డా ఎస్ సత్యనారాయణ రాజు అన్నారు. భీమవరం వెంకట్రామ థియేటర్ ప్రాంగణంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం కవిత దినోత్సవాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ సరిహద్దులు, సాంస్కృతిక భేదాలను అనుసంధానించడానికి కవిత్వం ఒక గొప్ప సాధనమని, అంతరించిపోతున్న భాషలు, అందులోని పదాలను వెలికితీసి వాటిని భవిష్యత్ తరానికి సురక్షితంగా అందించేదే కవిత అని అన్నారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, చైతన్య భారతీ నాటక పరిషత్ సభ్యులు భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ మనలో ఉన్న భావాలను వ్యక్తం చేస్తే కవిత్వం పుడుతుందని, అక్షర జ్ఞానం, అనుభవాల ఆధారంగా కవిత్వం పుడుతుందన్నారు. కార్యక్రమంలో పి రాజబాబు, విజ్జురోతి రాఘవులు, టివివి ప్రసాద్, పుప్పాల శేషు తదితరులు పాల్గొన్నారు.

# రబీకీ ఎల్‌నినో గండం



గుంటూరు (సువార్త ప్రతినిధి): ఎల్‌నినో ప్రభావం ఖరీఫ్ కంటే రబీ సీజన్‌పై తీవ్రంగా ఉంటుందని వ్యవసాయ, వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ‘వర్షాలు తక్కువగా ఉండటంతో ఖరీఫ్ సాగు తగ్గింది. భూగర్భ జలాలు, జలాశయాలు, చెరువుల్లో నీరు తగ్గితే దాని ప్రభావం రబీపై పడుతుంది. రబీ పంటలకు అవసరమైన నీరు అందకపోతే సాగు విస్తీర్ణం మరింత తగ్గే ప్రమాదం ఉంది’ అని ఆందోళన వ్యక్తం చేశారు. ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఉపకులపతి పీవీ సత్యనారాయణ అధ్యక్షతన ఎల్‌నినో-2026 కార్యాచరణ ప్రణాళిక వర్క్‌షా?ప జరిగింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వ్యవసాయ, వాతావరణ శాస్త్రవేత్తలు వివిధ అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఎల్‌నినో మరింత బలపడే సూచనలు ఉండటం, రాష్ట్రవ్యాప్తంగా వర్షపాత లోటు కొనసాగడం, ఖరీఫ్ సాగు విస్తీర్ణం తగ్గిపోవడంతో వచ్చే రబీ సీజన్‌పై ముందుగానే అప్రమత్తం కావాలని చెప్పారు.

28 జిల్లాల్లోనూ లోటు వర్షపాతం

జూన్ 1 నుంచి ఆగస్టు 19 వరకు ఏ జిల్లాలోనూ సాధారణ వర్షపాతం నమోదు కాలేదు. అన్నమయ్య జిల్లాలో అత్యధికంగా 75.4 శాతం లోటు నమోదైంది. ప్రకాశంలో 67.1, చిత్తూరులో 65.7, వైఎస్సార్ జిల్లాలో 52.3, బాపట్లలో 52.7, పల్నాడులో 47.3, గుంటూరు జిల్లాలో 44.2 శాతం లోటు ఉంది. పశ్చిమగోదావరిలో 56.4 శాతం, తూర్పుగోదావరిలో 56, కోనసీమలో 52.6, కాకినాడలో 46.3, ఏలూరులో 46.2 శాతం లోటు నమోదైంది. ఉత్తరాంధ్రలోని విశాఖపట్నంలో 54.3, శ్రీకాకుళంలో 51.2, అనకాపల్లిలో 47.3 శాతం లోటు ఉంది. రాయలసీమలోని అనంతపురంలో 39, సత్యసాయి జిల్లాలో 55.9, కర్నూలులో 36.6, నంద్యాలలో 49.8 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఆగస్టు 21 నుంచి 27 వరకు రాష్ట్రంలో విస్తారంగా భారీ వర్షాలు కురిసే అవకాశం లేదని అంచనా వేస్తున్నారు. కోస్తాంధ్రలో తేలికపాటి నుంచి మోస్తరుగా, రాయలసీమలో తేలికపాటి వర్షాలు మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని అంటున్నారు.

16.78 లక్షల హెక్టార్లలోనే పంటలు

ఆగస్టు 12 నాటికి రాష్ట్రంలో సాధారణ ఖరీఫ్ సాగు విస్తీర్ణం 30.84 లక్షల హెక్టార్లకు గాను 16.78 లక్షల హెక్టార్లలోనే (54 శాతం) పంటలు సాగయ్యాయి. గతేడాది ఇదే సమయానికి 17.99 లక్షల హెక్టార్లలో సాగైంది. గత ఏడాదితో పోలిస్తే సాగు గణనీయంగా తగ్గిన జిల్లాల్లో విజయనగరం ముందుంది. గత ఏడాది ఆగస్టు 12 నాటికి 55,856 హెక్టార్లలో సాగవ్వగా, ఈ ఏడాది 29,882 హెక్టార్లకే పరిమితమైంది. విశాఖపట్నంలో 1,280 నుంచి 749, అనకాపల్లిలో 7,810 నుంచి 5,931, కాకినాడలో 63,300 నుంచి 49,037, ఏలూరులో 65,077 నుంచి 47,448 హెక్టార్లకు సాగు తగ్గింది. కృష్ణా ప్రాంతంలోనూ సాగు తగ్గుదల కనిపించింది. కృష్ణా జిల్లాలో 1,24,023 నుంచి 1,05,601, ఎన్టీఆర్ జిల్లాలో 69,047 నుంచి 47,605, గుంటూరులో 52,892 నుంచి 33,297, పల్నాడులో 51,610 నుంచి 39,758 హెక్టార్లకు సాగు పడిపోయింది. బాపట్లలో 27,812 నుంచి 26,912, ప్రకాశంలో 7,400 నుంచి 4,933 హెక్టార్లకు సాగు తగ్గింది. అనంతపురంలో 1,50,998 నుంచి 1,60,659 హెక్టార్లకు సాగు పెరిగినా.. సత్యసాయి, నంద్యాల, కడప, అన్నమయ్య, చిత్తూరు తదితర జిల్లాల్లో సాధారణ లక్ష్యాలతో పోలిస్తే సాగు వెనకబడింది. దీంతో ప్రధాన పంటల సాగు కూడా ఆశించిన స్థాయిలో లేదు. వరి సాధారణ సీజన్ విస్తీర్ణం 15.14 లక్షల హెక్టార్లు కాగా ఇప్పటివరకు 8.17 లక్షల హెక్టార్లలోనే సాగైంది. పత్తి మాత్రం 3.60 లక్షల హెక్టార్లలో సాగై గత ఏడాదికంటే మెరుగ్గా ఉంది.

ఎల్‌నినో మరింత బలపడే అవకాశం!

ఆగస్టు 13న నవీకరించిన అంచనాల ప్రకారం సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు, డిసెంబరులో అత్యంత బలమైన ఎల్‌నినో ఏర్పడే అవకాశం 95 శాతం ఉంది. 2026-27లోనూ ఎల్‌నినో కొనసాగే అవకాశాలు ఉన్నట్లు అంచనాలు సూచిస్తున్నాయి. ఐఎండీ కూడా ఎల్‌నినో పరిస్థితులు కొనసాగుతున్నాయని, ఇవి బలపడే అవకాశం ఉందని తాజా నివేదికలో పేర్కొంది.

# పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీలకు 34శాతం




అమరావతి, (సువార్త ప్రతినిధి): గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం పునరుద్ధరించింది. గ్రామ పంచాయతీ సభ్యులు, సర్పంచ్‌లు, మండలపరిషత్ సభ్యులు, ఎంపీపీలు, జిల్లా పరిషత్ సభ్యులు, జడ్పీ చైర్‌పర్సన్ పదవులకు ఈ రిజర్వేషన్ వర్తించనుంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఉండేవి. 2020లో జారీ చేసిన రెండు జీవోల ద్వారా 24.15 శాతం విధానం అమల్లోకి వచ్చింది. తాజాగా పరిస్థితులను సమీక్షించిన కూటమి ప్రభుత్వం ఆ రిజర్వేషన్లను తిరిగి 34 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం-1994లోని సంబంధిత సెక్షన్ల ప్రకారం ఆయా పదవులకు 34 శాతం రిజర్వేషన్ వర్తిస్తుంది. చట్ట నిబంధనల ప్రకారం స్థానాల కేటాయింపు, రొటేషన్, మహిళలకు రిజర్వేషన్ వంటి ప్రక్రియలను అనుసరించి బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ముగిసిన సర్పంచ్‌ల పదవీకాలం

గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల పదవీకాలం ఏప్రిల్ 2తో ముగిసింది. మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు ఎన్నికైనవారి పదవీకాలం వరుసగా సెప్టెంబరు 23, 24 తేదీలతో ముగియనుంది. 16వ ఆర్థిక సంఘం మార్గదర్శకాల ప్రకారం చట్టబద్ధంగా ఏర్పాటైన గ్రామీణ స్థానిక సంస్థలు ఉండటం ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లకు కీలక అర్హత అని ప్రభుత్వం పేర్కొంది. 34 శాతం బీసీ రిజర్వేషన్లకు విరుద్ధంగా 2020 మార్చి 2న జారీ చేసిన 559, 560 జీఓలను అధిగమించినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే అమల్లో ఉన్న సంబంధిత చట్టాలు, నిబంధనలు, న్యాయస్థానాల ఉత్తర్వులను తప్పనిసరిగా పాటించాలని పేర్కొంది. బీసీ రిజర్వేషన్ల అమలుకు అవసరమైన తదుపరి చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌తో పాటు అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది.

# ఇక జడ్పీలకు ఒక్కరే ఉపాధ్యక్షుడు

అమరావతి, (సువార్త ప్రతినిధి): జిల్లా పరిషత్, మండల పరిషత్‌లలో ఇకపై ఒక్కరే ఉపాధ్యక్షుడు ఉంటారు. ఇద్దరు ఉపాధ్యక్షుల స్థానంలో ఒక్కరినే వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకునేలా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్ట రెండో సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. దీనిప్రకారం.. ప్రతి జిల్లా పరిషత్‌కు, మండల పరిషత్‌కు ఒక్కో చైర్‌పర్సన్‌ను, వైస్ చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవడం తప్పనిసరి. 2021లో అప్పటి వైసీపీ ప్రభుత్వం రెండు పరిషత్‌లకు ఇద్దరేసి ఉపాధ్యక్షులను ఎన్నుకునేలా చట్టానికి సవరణ చేసింది. దీంతో గత స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో ఇద్దరు చొప్పున వైస్‌చైర్మన్లను ఎన్నుకున్నారు. ఈ పద్ధతి వల్ల పరిపాలనాపరంగా ఎలాంటి ప్రయోజనమూ లేదని భావించిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం జిల్లా, మండల పరిషత్‌లలో రెండో వైస్ ప్రెసిడెంట్ పదవి నిబంధనను ఉపసంహరించుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ తరఫున మంత్రి నాదెండ్ల మనోహర్ శాసనసభలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్ట రెండో సవరణ బిల్లు ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై జరిగిన చర్చలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ.. జిల్లా, మండల పరిషత్‌లలో రెండో వైస్‌ప్రెసిడెంట్ పదవులు అలంకారప్రాయంగామారాయన్నారు. బిల్లుపై స్పీకర్ ఓటింగ్ నిర్వహించగా.. సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ

ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ చట్ట సవరణ బిల్లు-2026 కు కూడా అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అర్హులైన కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించేందుకు ప్రతిపాదించిన ఈ బిల్లును ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ గురువారం ప్రవేశపెట్టారు. చర్చ లేకుండానే సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. బిల్లు సభ ఆమోదం పొందినట్లు స్పీకర్ ప్రకటించారు.

# హైదరాబాద్‌లో ప్రైవేట్ స్థలాలు ఎన్ని?



హైదరాబాద్ (సువార్త ప్రతినిధి): 22ఏ కింద నిషేధిత జాబితాలో చూపుతున్న లక్షలాది మంది నిరుపేదల నివాసాలు, ఖాళీ స్థలాలతో పాటు పెద్ద పెద్ద భవనాలను ఆ జాబితా నుంచి బయటపడేసేందుకు జిల్లా రెవెన్యూ శాఖ చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ ఆదేశాలతో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో చర్చిస్తూ, రికార్డులను సరిచూస్తున్నారు. ప్రధానంగా రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో సబ్ రిజిస్ట్రార్లు తిరస్కరిస్తున్న సర్వే నంబర్లలో ఉన్న మొత్తం భూమి ఎంత.. అందులో ఎంతవరకు ప్రైవేట్ పట్టా స్థలాలు ఉన్నాయి.. వాటి పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో ఎన్ని కోర్టు కేసులు నడుస్తున్నాయి.. అనే వివరాలను ఆరా తీస్తున్నారు.

అధికారుల తప్పిదంతో నిషేధిత జాబితాలోకి..

రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని నెలలుగా 22ఏ సెక్షన్ తీవ్ర చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ప్రభుత్వ భూముల పరిరక్షణ పేరుతో తీసుకొచ్చిన ఈ చట్టంతో 50 ఏళ్లకు పైబడిన ప్రైవేట్ పట్టా భూములు, ఇళ్లు సైతం అనుకోకుండా ప్రోహిబిటెడ్ లిస్టులోకి వెళ్లాయి. అయితే కొంతమంది రెవెన్యూ అధికారుల తప్పిదంతోనే ఈ పొరపాట్లు చోటుచేసుకున్నాయని గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజులుగా దిద్దుబాటు చర్యలకు దిగింది. రాష్ట్రంలో ఇతర జిల్లాల్లో ఈ సమస్య తక్కువగా ఉన్నప్పటికీ, గ్రేటర్‌లోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌లో ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నివేదిక ఇచ్చేందుకు హడావుడి

వాస్తవంగా జిల్లాలో 12 లక్షలకు పైగా భూములు వివిధ కోర్టు కేసుల్లో ఉన్నాయి. ఏళ్ల తరబడి ఇవి కోర్టుల్లో నడుస్తూనే ఉన్నాయి. కౌంటర్లు దాఖలు చేయడంలో కొంతమంది తహసీల్దార్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో మగ్గుతున్నాయి. దీంతో కొంత మంది వాటిని ఆక్రమించుకుని పట్టాలు సైతం పొందుతున్నారనే ఆరోపణలున్నాయి. ఈ తరుణంలో మండలాల వారీగా అసలు కోర్టు కేసులు ఎన్ని ఉన్నాయి.. వాటి ప్రస్తుత పరిస్థితిని తెలియజేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో కొందరు హడావుడి పడుతున్నారు. కోర్టులకు వెళ్లకపోవడంతో సమగ్ర సమాచారం లేకపోవడంతో పరేషాన్ అవుతున్నారు.

సబ్ రిజిస్ట్రార్లతో సంప్రదింపులు

22ఏపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన తరుణంలో జిల్లాలోని తహసీల్దార్లు.. తమ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్లతో సంప్రదింపులు జరుపుతున్నారు. అన్నింటినీ తిరస్కరించి ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దని, సరిగా ఉన్న వాటికి బై నంబర్లు ఇస్తామని, అప్పటివరకు ఓపిక పట్టాలని కోరుతున్నారు. ఇదే సమయంలో రోజవారీ ప్రక్రియను కూడా తెలుసుకుని కలెక్టర్‌కు నివేదిక అందజేస్తున్నారు. మొత్తంగా 22ఏపై జిల్లా రెవెన్యూ అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

# గంజాయి స్మగ్లర్లతో దోస్తీ కట్టిన పోలీసులపై చర్యలు !



హైదరాబాద్ (సువార్త ప్రతినిధి): గంజాయి స్మగ్లర్లు అయిన బొల్లా సోదరులతో దోస్తీ కట్టిన ఓ ఎస్సై, ఐదుగురు కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమవుతోంది. ఈ పోలీసుల వ్యవహారంపై ఈగల్ బృందం, బాలానగర్ ఏసీపీ తయారు చేసిన నివేదికలు సైబరాబాద్ సీపీ ఎం.రమ్మ?షకు చేరినట్టు తెలిసింది. ఆ నివేదికలను పరిశీలించిన తర్వాత సీపీ.. నేడో, రేపో చర్యలు తీసుకుంటారని సమాచారం హైదరాబాద్‌లోని బాలానగర్ పరిధిలో గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న బొల్లా సోదరులను వారం క్రితం ఈగల్ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. క్యాటరింగ్ పనులు చేసుకునే వారిలా నటించిన బొల్లా సోదరులు ఒడిశా నుంచి గంజాయిని తెప్పించి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో పలువురు పోలీసులతో స్నేహం పెంచుకున్నారు. బొల్లా సోదరుల గుట్టు తెలుసుకున్న ఈగల్ బృందం వారి స్థావరాలపై దాడి చేయగా. ఎదురుతిరిగారు. పోలీసులపై శునకాలను వదలడమే కాక స్క్రూడ్రైవర్‌తో ఓ ఇన్‌స్పెక్టర్‌ను పొడిచారు. కానీ పోలీసులు వారిని అరెస్టు చేశారు. నిందితులను విచారించగా ఓ ఎస్సై, ఐదుగురు కానిస్టేబుళ్లతో వారికున్న సంబంధం బయటపడింది. ఈగల్ బృందం దాడికి ఒక్క రోజు ముందు స్మగ్లర్ల గదిలోనే సదరు పోలీసులు పార్టీ కూడా చేసుకున్నట్టు తెలిసింది. వీరి మధ్య ఉన్న సంబంధాలపై ఈగల్, బాలానగర్ ఏసీపీ విచారణ జరిపి వేర్వేరుగా నివేదికలు రూపొందించి సైబరాబాద్ సీపీకి సమర్పించారు.

# 22ఏపై ప్రతి ఫిర్యాదునూ పరిష్కరిస్తాం



హైదరాబాద్, సత్తుపల్లి, (సువార్త ప్రతినిధి): 22ఏ భూముల విషయంలో ప్రజలకు భరోసా కల్పించేలా రెవెన్యూ శాఖ చర్యలు ఉంటాయని, అర్హత ఉన్న ప్రతి ఫిర్యాదును పరిష్కరించి, దరఖాస్తుదారుకు న్యాయం జరిగేలా చూస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నిషేధిత భూముల విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. 22ఏపై ఫిర్యాదులు, వాటి పరిష్కారంపై టెలికాన్ఫరెన్స్ ద్వారా మంత్రి సమీక్ష నిర్వహించారు. అలాగే, ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం నారాయణపురంలో భూ రీ సర్వేపై అవగాహన సదస్సులోనూ ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోర్ అర్బన్ పరిధిలో ఉన్న నాలుగు జిల్లాల్లో 22ఏ అంశంపై ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సుమారు 400 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు వివరించారు. కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును పరిష్కరించే దిశగా పని చేయాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుదారు పూర్తి వివరాలను ఆర్డీవో, తహశీల్దార్, సబ్ రిజిస్ట్రార్లకు పంపాలని సూచించారు. అలాగే, సమస్య పరిష్కారమయ్యే వరకు పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు.

కాల్ సెంటర్ నుంచి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు స్వీకరించిన అధికారులు తక్షణమే స్పందించాలని, ఒకసారి ఫిర్యాదు చేశాక.. మళ్లీ మళ్లీ ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా చూడాలని ఆదేశించారు. రెవెన్యూ సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిష్కరించేలా శుక్రవారం నుంచి జిల్లాల వారీగా రెవెన్యూ సమీక్షలు, ఇందిరమ్మ ఇళ్ల పథకంపైనా సమీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో వేలాది ఎకరాల అక్రమాస్తులను బీఆర్ఎస్ నాయకులు కొల్లగొట్టారని, 22ఏను భూతంగా చూపి ఆయా ఆస్తులను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు కుట్ర చేస్తున్నారని, ఈ క్రమంలోనే నిషేధిత జాబితాలో చేర్చారంటూ అమాయకులను ముందుపెట్టి ఆ పార్టీ నేతలు డ్రామాలాడుతున్నారని మండిపడ్డారు. వారు చేసిన అక్రమాలను తమ ప్రభుత్వంపై రుద్దాలని చూస్తున్నారని, వారి బెదిరింపులు, ఆరోపణలకు తాను గానీ, ప్రభుత్వం గానీ భయపడేది లేదని స్పష్టం చేశారు. భూ భారతి చట్టం వచ్చే ఎన్నికలకు రెఫరెండమన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద 25 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే పూర్తి కావొచ్చిందన్నారు. ఏడాదిన్నరలో రాష్ట్రంలోని భూముల రీ సర్వే పూర్తి చేస్తామని ప్రకటించారు.

# ఘనంగా శతాధిక వృద్ధురాలి జన్మదినోత్సవం



రాంనగర్, (సువార్త ప్రతినిధి): హైదరాబాద్, విద్యానగర్‌కు చెందిన కిళాంబి అలివేలు 106వ జన్మదిన వేడుకలను ఆమె కుటుంబసభ్యులు ఘనంగా నిర్వహించారు. కిళాంబి అలివేలు 1921 ఆగస్టు 20న జన్మించారు. ఆమె భర్త కిళాంబి కృష్ణమాచార్యులు సెంట్రల్ ఎక్సైజ్ విభాగంలో అసిస్టెంట్ కలెక్టర్‌గా పని చేశారు. అలివేలు, కృష్ణామాచార్యుల దంపతులకు ఐదుగురు కుమారులు. ముగ్గురు కుమార్తెలు సంతానం ఉన్నారు. కృష్ణామాచార్యులు కొంతకాలం క్రితం మరణించగా.. అలివేలు సంరక్షణను కుమార్తెలు, కొడుకులు, కోడళ్లు చూసుకుంటున్నారు. గురువారం ఆమె 106వ జన్మదిన సందర్భంగా కుటుంబ సభ్యులు పాదపూజ చేసి వేదపండితులచే ఆశీర్వచనాలు అందించారు. అమె కూడా పాటపాడి కుటుంబసభ్యులను ఆశీర్వదించారు. 106 ఏళ్ల వయస్సులో ఉన్న అలివేలు.. చేతికర్ర సాయంతో నడుస్తున్నారని, ఆమెకు రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలు లేవని సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని కుటుంబసభ్యులు తెలిపారు. అంతేకాక, చిన్నతనంలో నేర్చుకున్న పాటలు, పద్యాలను ఇప్పటికీ పాడటమే కాక రామాయణ, భాగవతాలను చెబుతుంటారని వివరించారు.

# కృష్ణా ప్రాజెక్టులకు జలకళ



గద్వాల, హైదరాబాద్, (సువార్త ప్రతినిధి): కృష్ణా బేసిన్‌లో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులకు వరదనీటి ప్రవాహం పెరిగింది. శ్రీశైలానికి 57,298 క్యూసెక్కులు, నారాయణపూర్‌కు 58 వేలు, జూరాలకు 75 వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో పది గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. ఆల్మట్టి ప్రాజెక్టుకు 48,111 క్యూసెక్కులు, తుంగభద్రకు 12 వేలు, నాగార్జునసాగర్‌కు 34 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రికార్డయింది.

# క్యాన్సర్ కేర్, ఆరోగ్యశ్రీ భేష్!




హైదరాబాద్, (సువార్త ప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వం పేదలకు అందిస్తున్న వైద్య సేవలు, క్యాన్సర్ వ్యాధి నివారణకు అమలుచేస్తున్న అత్యాధునిక విధానాలు అభినందనీయమని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కొనియాడింది. ముఖ్యంగా నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని చేరువ చేస్తున్న ఆరోగ్యశ్రీ, ఉచిత రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే టీ-డయాగ్నోస్టిక్స్, దీర్ఘకాలిక రోగులకు సాంత్వన చేకూరుస్తున్న పాలియేటివ్ కేర్ నెట్‌వర్క్ పనితీరుపై కమిటీ సభ్యులు ప్రశంసలు కురిపించారు. వివిధ రాష్ట్రాల్లోని ప్రజారోగ్య వ్యవస్థల సమర్థత, మౌలిక వసతులను క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేస్తున్న ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ పార్లమెంటరీ కమిటీ గురువారం హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, జాతీయ పరిశోధనా సంస్థల శాస్త్రవేత్తలు, ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలతో సమావేశమై పలు అంశాలపై చర్చించింది.

క్యాన్సర్ వైద్య సేవలపై సంతృప్తి

రాష్ట్రంలో అమలువుతున్న క్యాన్సర్ కేర్ మోడల్‌పై సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించేందుకు నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షల నుంచి ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి ద్వారా అందిస్తున్న అత్యాధునిక రేడియేషన్, సర్జికల్, కీమోథెరపీ సేవలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రాణాంతక వ్యాధులతో బాధపడే నిరుపేద రోగులకు జిల్లా, మండల స్థాయిల్లోన్టేసవలందించే పాలియేటివ్ కేర్ కేంద్రాల నిర్వహణపై కమిటీ సంతృప్తి వ్యక్తం చేసింది. వైద్య ఖర్చులతో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోకుండా ఆరోగ్యశ్రీ పథకం ఆర్థిక రక్షణ కవచంలా నిలుస్తోందని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో హైదరాబాద్‌లోని ప్రముఖ జాతీయ పరిశోధనా సంస్థల ప్రతినిధులు తమ సరికొత్త పరిశోధనల వివరాలను కమిటీ ముందుంచారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) శాస్త్రవేత్తలు స్థానికంగానే తక్కువ ఖర్చుతో అభివృద్ధి చేస్తున్న క్యాన్సర్ నివారణ మాలిక్యూల్స్, యాక్టివ్ ఫార్మాష్యూటికల్ ఇంగ్రిడియంట్స్ (ఏపీఐ) గురించి వివరించారు. సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) శాస్త్రవేత్తలు క్యాన్సర్ కణాల జన్యుపరమైన మార్పులు, మాలిక్యులర్ డయాగ్నోసిస్, టార్గెటెడ్ థెరపీకి సంబంధించిన ప్రయోగాలను వివరించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) డైరెక్టర్, శాస్త్రవేత్తలు పోషకాహార లోపాల నివారణ, జీవనశైలి మార్పులతో వచ్చే దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణపై తాము చేపడుతున్న పరిశోధనలను కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్ఎండీసీ, ఎన్టీపీసీ, భెల్, హెచ్ఏఎల్ తదితర కేంద్ర ప్రభుత్వ సంస్థల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులను ప్రజారోగ్య వ్యవస్థల బలోపేతానికి ఏ విధంగా అనుసంధానిస్తున్నారో కమిటీ సమీక్షించింది. ఆయుష్మాన్ భారత్ మిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాథమిక, ద్వితీయ శ్రేణి ఆస్పత్రుల్లో వైద్య పరికరాల కొనుగోలు, మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులను మరింత సమర్థంగా వినియోగించుకోవాలని కమిటీ సూచించింది.

# ఏసీబీ వలలో ఇద్దరు ప్రభుత్వోద్యోగులు



కామారెడ్డి/ శంకరపట్నం, (సువార్త ప్రతినిధి): రాష్ట్రంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ప్రభుత్వోద్యోగులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. కామారెడ్డి జిల్లా రాజంపేట మండల కేంద్రంలో సిమెంట్ వ్యాపారుల మధ్య జరిగిన ఘర్షణ సందర్భంగా నమోదైన కేసులో ఒక వర్గం వ్యాపారికి స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి రాజంపేట ఎస్ఐ ఆంజనేయులు రూ.50 వేలు లంచం అడిగి.. రూ.30 వేలకు ఒప్పుకున్నాడు. కానీ, ఆ డబ్బు ఇవ్వలేక ఏసీబీ అధికారులను ఆశ్రయించిన వ్యాపారి.. వారి సూచన మేరకు గురువారం ఎస్ఐకి కామారెడ్డిలోని ఎన్‌జీవోఎ?స కాలనీలోని ఆయన ఇంటి వద్దే సదరు వ్యాపారి రూ. 30 వేలు లంచం ఇస్తుండగా.. డీఎస్పీ శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో అక్కడే నిఘా పెట్టిన ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా ఆంజనేయులును పట్టుకుని.. నగదు స్వా?ధీనం చేసుకున్నారు. మరో ఘటనలో కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం రాజాపూర్ వాసి తన తండ్రి పేరు మీదున్న ఆస్తిని తన తల్లి, తన పేరు మీద మార్చడానికి గత నెల 21న స్లాట్ బుక్ చేసుకున్నాడు.

# తుని చినారి జానేశరి అదశ..
# ఏపీ హైకోరుకు పోలీసుల నివేదిక..

కాకినాడ, (సువార్త ప్రతినిధి): తుని చినారి సుకర జానేశరి అదశపై ఆధపదేశ్ హైకోరుకు పోలీసులు నివేదిక సమరిచారు. ఇపటివరకు జరిగిన కేసు దరాపు వివరాలను ఆ నివేదిక దారా కోరుకు తెలియజేశారు. జానేశరి కనిపిచకుడా పోయి నేటికి 70 రోజులు గడిచాయి. ఇని రోజులైనా చినారి ఆచూకీ మాత లభిచలేదు.




చినారి ఆచూకీని కనిపెటడలో పోలీసులు విఫలమయారటూ హైకోరులో నాయవాది జి.శీకాత్ ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసుపై హైకోరు పధాన నాయమూరి జసిస్ లిసా గిల్, జసిస్ గుణరజన్‌తో కూడిన ధరాసన విచారణ చేపటిది. ఈ సదరగా జానేశరి కేసు విషయలో పోలీసుల తీరును కోరు దషికి శీకాత్ తీసుకువచారు. నెలలు గడిచినా చినారి ఆచూకీ కనిపెటలేదని పేరొనారు. మరోవైపు, పోలీసుల తరఫున నాయవాది జయతి వాదనలు వినిపిచారు. జానేశరి ఆచూకీ కోస పోలీసులు అని పయతాలు చేసునారని ధరాసనానికి తెలిపారు. ఇరువరాల వాదనలు విన నాయసాన.. జానేశరి అదశానికి సబధిచి 15 రోజులకు ఒకసారి నివేదిక ఇవాలని పోలీసులను ఆదేశిచిది. దీతో కేసు దరాపు నివేదికను సమరిచారు.

కాగా, జానేశరి అదశతో బాధిత కుటుబ తీవగా కుగిపోయిది. నిత తమ కుమారె ఫొటోలు, వీడియోలను చూసుకుటూ తలిదడులు ఆవేదన వక చేసునారు. చినారి తడి గణేశ్ ఓ యూటూబ్ ఛానెల్ పెటారు. అదులో తన కుమారెకు సబధిచిన ఫొటోలు, వీడియోలను ఆయన షేర్ చేసునారు.

# మా ఆదేశాలను తేలిగ్గా తీసుకోవద్దు: హైకోర్టు




అమరావతి, (సువార్త ప్రతినిధి): వివిధ కేసుల్లో కౌంటర్లు, స్థాయి నివేదికలు, మెమోలు దాఖలు చేయాలని కోరుతూ తామిచ్చే ఆదేశాలను అధికారులు తేలిగ్గా తీసుకుంటున్నారని హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. అలాంటి అధికారుల పట్ల ఉదారంగా ఉండొద్దని అడ్వొకేట్ జనరల్ (ఏజీ), ప్రభుత్వ న్యాయవాదులకు స్పష్టం చేసింది. చాలా కేసుల్లో కౌంటర్లు దాఖలు చేయని ఘటనలు తమ దృష్టికి తరచూ వస్తున్నాయని తెలిపింది. కేసు విచారణకు వచ్చే ముందురోజు లేదంటే అదేరోజు దాఖలు చేస్తున్నారని, ఇది సరికాదని పేర్కొంది. సకాలంలో కౌంటర్లు, వివరాలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని, అధికారుల పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించింది. ఏజీ స్పందిస్తూ... కౌంటర్ల దాఖలులో జాప్యం ఉద్దేశపూర్వకంగా చేస్తున్నది కాదన్నారు. ఈ విషయంలో మరింత సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇకపై సకాలంలో కోర్టుకు వివరాలు అందించేలా అధికారులకు సూచిస్తామన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం పోలీసు శాఖలో ఖాళీల భర్తీలో జరుగుతున్న జాప్యం, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పోలీసుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలపై స్థాయి నివేదిక దాఖలు చేసేందుకు చివరి అవకాశమిస్తూ విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసాగిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

# ఏపీ లోకాయుక్తగా జస్టిస్ మల్లికార్జునరావు

అమరావతి/కర్నూలు లీగల్,(సువార్త ప్రతినిధి): ఏపీ లోకాయుక్తగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు నియమితులయ్యారు. సీఎం నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ఆయన్ను ఎంపిక చేసి ఆమోదం కోసం ఫైలును గవర్నర్‌కు పంపింది. గవర్నర్ అబ్దుల్ నజీర్ ఇందుకు ఆమోదముద్ర వేశారు. లోకాయుక్తగా జస్టిస్ మల్లికార్జునరావు నియామకానికి సంబంధించి ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. నియామకపు తేదీ నుంచి ఐదేళ్ల పాటు ఆయన పదవిలో కొనసాగుతారు. జస్టిస్ మల్లికార్జునరావును లోకాయుక్తగా నియమించడంతో కేసుల విచారణ పూర్తిస్థాయిలో కొనసాగుతాయని న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఇదీ నేపథ్యం: జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు 1964 జనవరి 19న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పుల్లేటికుర్రులో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. శ్రీరామచంద్రమూర్తి, రమణ దంపతులకు ద్వితీయ పుత్రుడు. ఆయన స్వస్థలం అయినవిల్లి మండలం నేదునూరు. అక్కడే పదో తరగతి వరకు చదివారు. అమలాపురంలో బీఎస్సీ అభ్యసించారు. రాజమహేంద్రవరంలోని జీవ?సకేఎం న్యాయ కళాశాలలో న్యాయశాస్త్రం చదివారు. 1988లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. అనంతరం న్యాయాధికారిగా ఎంపికైన ఆయన ప్రస్తుత బాపట్ల జిల్లా పర్చూరులో 1994లో అదనపు డిస్ట్రిక్ట్ మునీ?స్ఫగా బాధ్యతలు చేపట్టారు. ధర్మవరం, అనకాపల్లి, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో న్యాయాధికారిగా సేవలు అందించారు. 2007లో సీనియర్ సివిల్ జడ్జిగా, 2015లో జిల్లా జడ్జిగా పదోన్నతి పొంది మచిలీపట్నం, ఏలూరులో పనిచేశారు. 2022 ఆగస్టు 4న ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2024 మార్చి 14న శాశ్వత న్యాయమూర్తిగా నియమితులై ప్రమాణం చేశారు. ఈ ఏడాది జనవరి 18న పదవీ విరమణ చేశారు.

# 22, 23 తేదీల్లో బ్రిక్స్ దేశాల సమావేశాలు

విశాఖపట్నం, (సువార్త ప్రతినిధి): విశాఖపట్నంలో ఈ నెల 22, 23 తేదీల్లో బ్రిక్స్ దేశాల యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రుల సమావేశాలు జరగనున్నాయి. 11 దేశాల (బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్టు, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్) ప్రతినిధులు హాజరుకానున్న ఈ సమావేశాల్లో యువత, క్రీడలు, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ సహకారంపై చర్చించనున్నారు. 'స్థితిస్థాపకత, నూతన ఆవిష్కరణలు, పరస్పర సహకారం, సుస్థిరతను పెంపొందించడం' (బిల్డింగ్ ఆఫ్ రెజిలియన్స్, ఇన్నోవేషన్, కో-ఆపరేషన్ అండ్ సస్టెయిన్‌బిలిటీ) అనే అంశంపై సమావేశాలు జరుగుతాయి. ఈ సందర్భంగా 22వ తేదీన తొట్లకొండలో మొక్కలు నాటే కార్యక్రమం, వారసత్వ ప్రదేశ సందర్శన, ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహిస్తారు. అనంతరం రాడిసిన్‌బ్లూ హోటల్‌లో యువజన మంత్రుల సమావేశం జరుగుతుంది. అదే రోజు రాత్రి నోవాటెల్ హోటల్‌లో రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ప్రత్యేక




సాంస్కృతిక కార్యక్రమాలతో గాలా డిన్నర్ జరుగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి హాజరుకానున్నారు. 23వ తేదీ ఉదయం బ్రిక్స్ ఫ్రెండ్‌షిప్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తారు.

# సముద్రంలో గల్లంతైన 7 మంది మత్స్యకారులు.. ముమ్మరంగా గాలింపు

కోనసీమ (సువార్త ప్రతినిధి): సముద్రంలో గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పారాదీప్‌కు సుమారు 15 నాటికల్ మైళ్ల దూరంలో 'ముత్యాలమ్మ' పేరుతో ఉన్న పసుపు రంగు బోటును అధికారులు గుర్తించారు. ఈ బోటు గల్లంతైన మత్స్యకారులు వెళ్లిన బోటేనా? అనే విషయాన్ని ప్రత్యేక బృందాలు పరిశీలిస్తున్నాయి. ఆగస్టు 3న కోనసీమ జిల్లా ఓడలరేవు ఫిషింగ్ ల్యాండింగ్ సెంటర్ నుంచి 135 'ముత్యాలమ్మ' బోటులో ఏడుగురు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లారు. అనంతరం వారు గల్లంతయ్యారు. అప్పటి నుంచి వారి ఆచూకీ కోసం అధికారులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.సుమారు 300 నాటికల్ మైళ్ల పరిధిలో గాలింపు కొనసాగుతోంది. కోస్ట్‌గార్డ్‌కు చెందిన ఐదు నౌకలు, నేవీకి చెందిన రెండు నౌకలు గాలింపు చర్యల్లో పాల్గొంటున్నాయి. అలాగే నేవీకి చెందిన రెండు అత్యాధునిక విమానాలతోనూ సముద్రంలో గాలిస్తున్నారు. గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు భరోసా కల్పించారు. మత్స్యకారుల ఆచూకీ కోసం ఒడిశా, పశ్చిమ బెంగాల్, అసోం తీర ప్రాంత రక్షణ విభాగాలతో సమన్వయం చేసుకుంటున్నారు. మరోవైపు, గల్లంతైన బోటులో సుమారు 1,000 లీటర్ల డీజిల్, 20 రోజులకు సరిపడా ఆహార నిల్వలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం సముద్ర వాతావరణం అనుకూలంగా ఉండటంతో మత్స్యకారులు క్షేమంగా ఉండే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కష్టాలు తొలగిపోతాయని.. మళ్లీ పెళ్లి!



అన్నవరం, (సువార్త ప్రతినిధి): ఆ దంపతులు కొన్నేళ్ల కిందట ఒక్కటయ్యారు. అయితే పెళ్లి తర్వాత ఆ కుటుంబాలను ఆర్థిక, ఆరోగ్య, మానసిక సమస్యలు వెంటాడుతున్నాయి. దీంతో ఒక ఆస్థాన సిద్ధాంతి సూచన మేరకు సత్యదేవుడి సన్నిధిలో మళ్లీ పెళ్లి చేసుకున్నారు. కాకినాడ జిల్లా అన్నవరం ఆలయ ప్రాంగణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. విశాఖ జిల్లా ఆనందపురానికి చెందిన మూడు జంటలు, అచ్యుతాపురానికి చెందిన ఆరు జంటలు బుధవారం ఆలయ ప్రాంగణానికి చేరుకోగా, పురోహితులు తొమ్మిది జంటలకు మళ్లీ వివాహం జరిపించారు. కష్టాలన్నీ గట్టెక్కేందుకు సత్యదేవుడి సన్నిధిలో పునర్వివాహం చేసుకున్నామని వారు చెప్పారు.

# శ్రీశైలానికి మళ్లీ వరద



శ్రీశైలం, (సువార్త ప్రతినిధి): శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం మళ్లీ మొదలైంది. జూరాల ప్రాజెక్టు క్రస్ట్‌గేట్ల ద్వారా 24,912 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా 40,978 క్యూసెక్కులు కలిపి మొత్త 65,890 క్యూసెక్కులు ఇన్‌ఫ్లోగా విడుదలైంది. సాయంత్రానికి 30,512 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయానికి వచ్చినట్లు అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 875.50 అడుగులు ఉంది. పుర్తిస్థాయి నీటి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 165.92 టీఎంసీలు ఉంది. కుడి ఎడమ జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగిస్తూ 55,768క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జెన్‌కో అధికారులు తెలిపారు.

# జెత్వాని కేసులో అభ్యంతరాలపై విచారణ 2కు వాయిదా



విజయవాడ, (సువార్త ప్రతినిధి): ముంబై నటి కాదంబరి జెత్వానిపై నమోదైన కేసులో వైసీపీ నాయకుడు కుక్కల విద్యాసాగర్ (కేవీఎస్) దాఖలు చేసిన అభ్యంతరాలపై విచారణ 2వ తేదీకి వాయిదా పడింది. తనను బ్లాక్‌మెయిల్ చేసి కోట్లాది రూపాయలు జెత్వాని వసూలు చేశారని విద్యాసాగర్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో జెత్వానితో పాటు ఆమె తల్లిదండ్రులు ఆశా జెత్వాని, నరేంద్రకుమార్ జెత్వాని, సోదరుడు అంబరీశ్ జెత్వాని నిందితులుగా ఉన్నారు. కాదంబరి జెత్వానీని తప్ప మిగిలిన ముగ్గురిని నిందితుల జాబితా నుంచి తొలగిస్తున్నట్టు సీఐడీ కోర్టుకు తెలిపింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కేవీఎస్ దాఖలు చేసిన పిటిషన్‌పై సీఐడీ కోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఈ పిటిషన్‌పై వాదనలను వచ్చే నెల రెండో తేదీకి కోర్టు వాయిదా వేసింది.

# జర్మనీ మిషనరీ రిచర్డ్ ఆర్టిల్



(సువార్త ప్రతినిధి): నేటి సేవకులకున్న భారమును నాటి మిషనరీల భారముతో పోల్చుకుంటే, నిజముగా మనము చేస్తున్నది సేవేనా? నాటి మిషనరీలు, భక్తులు ఎంతో త్యాగము చేసి మార్గము సరాళము చేసినను, సరళమైన త్రోవలో సేవచేయుటకే ఎంతగానో యిబ్బంది పడిపోతున్నారు. పంతొమ్మిదవ శతాబ్దపు ప్రారంభములో జర్మనీకి చెందిన యొక క్రైస్తవ మిషనరీ సంస్థ నాగాలాండ్ అడవిప్రాంతములో నివసించుచుండిన అడవి మనుష్యులుకు సువార్త ప్రకటించి వారిని దేవునిలోనికి నడిపింప నెంచి, ఆ సంస్థవారు ఒకరి తరువాత నొకరిని పంపుతూ, ఆరుగురు మిషనరీలను పోగొట్టుకొన్నది. ఆరుగురు మిషనరీలు అడవి మనుష్యుల చేత చంపబడియుండుట గమనించిన ఆ సంస్థ కమిటీ కూడి మాటలాడుతూ ఇప్పటికే ఆరుగురిని మనము చంపుకొన్నాము గనుక యిక ఆ ప్రాంతములకు మిషనరీలను పంపబోమని నిర్ణయించుచుండగా వారిలో ఒకరైన దైవజనులు రిచర్డ్ ఆర్టిల్ లేచి నిల్చుండి అందుకని వారిని నరకాన్ని పంపలేము, ఆ ఆత్మలు కూడా దేవునిదృష్టికి బహు విలువైనవి కావున, ఆ ప్రాంత ప్రజలను దేవునిలోనికి నడిపించుటకు నేను వెళ్ళెదనని చెప్పగా ఆ సంస్థ పెద్దలందరూ వద్దు, వెళ్ళవద్దు ఇప్పటికే ఆరుగురిని మనము కోల్పోయాము నిన్నుకూడా మేము పోగొట్టుకోలేమని బలవంతము చేసినను...రిచర్డ్ ఆర్టిల్ దృఢ నిశ్చయముగా, నేను చావను నిశ్చయముగా వారిని రక్షణ అనుభవములోనికి తీసుకొని వచ్చేంతవరకు నేను చావను, నిశ్చయముగా దేవుడే నాకు తోడైయుండి యీ పరిచర్యను నాకు దీవెనకరముగా చేయగలడని చెప్పి, బలవంతముగా జర్మనీ నుండి నాగాలాండ్కు పంపబడెను.పూర్వము పంపబడిన ఆరుగురు చంపబడిన విధానమును గమనించినపుడు, అడవి మనుష్యులకు తెల్లగా ఉండిన మిషనరీలను చూడగానే యిదేదో క్రొత్త జంతువనుకొని ప్రాణముతోనే చీల్చుకొని చంపితినియున్నారు. దీని జ్ఞాపికతో ఉంచుకొన్న ఆర్టిల్ ఆ అడవిలోనికి మంచి రాత్రిజామున ప్రవేశించి ఒకచెట్టుమీద కూర్చుండి రెండు మూడు రోజులు వారిచర్యలను పరిశీలిస్తూ వచ్చాడు. స్నానమంటే తెలీక, మురికిగా ఉంటూ, వారికంటపడిన ప్రతి జీవిని కొట్టిచంపి పచ్చిగానే తింటూ వస్తుండగా గమనించిన ; రిచర్డ్ ఆర్టిల్, తెల్లగా ఉంటున్న తనదేహమునకు నల్లనిరంగు వేసికొని ఆ మనుష్యులను పోలి దిగంబరిగా సంచరిస్తూ వారిలో ఒకడై పోయాడు. అయితే రుచికరమైన భోజనము చేయుటకు అలవాటుపడిన ఆర్టిల్ కుందేలును పట్టుకొని దానిచంపి పచ్చిగానే తినుటకు ప్రారంభించెను, తనకు వాంతి వచ్చినను సమర్ధించుకొంటూ రెండుమూడు మాసాలు గడిపాడు. ఆపై ఒకరోజు ఉడుమును పట్టుకొని పచ్చిగానే తినబోవుచుండిన యొకని యొద్దకు వెళ్ళి చేసైగ చేసి దీని యిలాగు తినుటకంటే కాల్చుకొని తిందుమా? అని చెప్పి రాయికి రాయిని కొట్టి నిప్పురాబెట్టి అక్కడి ఆకులు, పుల్లలను కాల్చి ఆ మంటలో ఉడుము కాల్చిన పిమ్మట తుంచుకొని తింటుంటే వారికందరికి ఆశ్చర్యముగాను, ఆనందముగా ఉండి, యింకా యేయే విధము భోజ్యము చేయవచ్చో చెప్పమని అడుగుతూ ఆ ప్రాంత ప్రజలందరూ ఆర్టిల్ దగ్గరకు వచ్చుచుండగా, యితను చల్లగా వారికి నాయకుడాయెను. ఆ ప్రకారము వారికి పల వెరైటీస్ చూపుతూ, నేర్పుతూ వారిపై పెత్తనం రాగానే మొదటిగా సాంఘికపరంగా వీరిలో చైతన్యం తేవాలని ప్రయత్నించి, వారిని అడవి అంచులకు నగరము యొక్క సరిహద్దులకు తీసుకొని రాగానే వారందరు బయటి ప్రపంచమును చూచి ఆశ్చర్యమొంది మనము కూడా వారిలాగే ఆనందముగా ఉండాలంటే ఏం చెయ్యాలి? యిప్పుడే మనము బయటి కెల్లుదుమా? అని అడుగగా ఆర్టిల్ వారందరిని చూడండి వారెంతో సౌందర్యముగాను, క్రమముగా వస్త్రధారణ చేసికొనియున్నారు. వారివలె మనము వస్త్రాలు ఏ ధరిస్తే వెళ్ళవచ్చును గాని వస్త్రాలు లేకుండ బయటికి వెళ్ళమంటే వారందరు మనల్ని ! చంపేస్తారని చెప్పడముతో ఈ మనుష్యులు, ఏలాగైతేనేమి మమ్మల్ని ఒక్కసారి తీసికొనిపొమ్మని బతిమాలగా, ఆర్టిల్ – ఇబ్బందేమీ కాదుగాని మీరందరు శుభ్రముగా స్నానముచేసి వారిని పోలి దుస్తులు వేసుకొంటారా? అట్లయితే నేను మిమ్మును తీసుకొని పోతానని చెప్పినందుకు వారందరు ఒక్కమాటగా నీవు చెప్పినట్టే వింటాము గాని మనకు బట్టలు ఏలాగని అడుగగా – అలాగైతే నేనెలాగైనా ఏర్పాటు చేస్తాను; మనకెవరు వాటిని సహాయము చేస్తారో వారికి హానిచేయక వారు చెప్పినట్టుగా మనము చేయగలిగితే నిశ్చయముగా మీరు ఆశించిన రీతిగానే నేను ఏర్పాటు చేయగలనని చెప్పి, వారిని మానసికంగా సిద్ధము చేసి, ఆపై ఆపై జర్మనీ నుండి నిధులను రప్పించి మిషనరీలను పిలువనంపి జీవితములో తొలిసారిగా స్నానము చేయించి, దుస్తులచేత అలంకరించి వారిని చక్కపరచగా ఆనంద సాగరములో వారు మునిగితేలారు. అప్పుడు వారు అనగా జర్మనీ నుండి వచ్చిన వారు రిచర్డ్ ఆర్టిల్ శ్రమకు సామర్థ్యమునకు ఆశ్చర్యమొందారు. సాంఘికపరమైన భద్రత కల్పించగా వారు ఆర్టిల్ని దేవునిగా భావించి పూజింపనెంచగా; ఆర్టిల్ యేసుక్రీస్తు ప్రేమను గూర్చి రాజ్యసువార్తను గూర్చి తెలియచెప్పగా అడవిమనుష్యులు మనవంటి మనుష్యులై దేవునియందు విశ్వసించి క్రీస్తును రక్షకునిగా అంగీకరించి, పౌరషముగల దేవుని బిడ్డలుగా మారారు. అట్టి భయంకరమగు అడవిజాతి ప్రజలను రక్షణలోనికి నడిపించుటకు, తన సుఖ సౌఖ్యములు ప్రక్కనబెట్టి, ఆర్టిల్కు అలవాటు లేకపోయిన కుందేళ్ళను, ఉడుములను పచ్చిగానే తినుచు, క్రక్కుదు వచ్చినను, మ్రింగుడు పడకుండినను సహించి, ప్రార్థించి సహనముతో అన్నిటిని తాళుకొని మొదటిగా సాంఘిక సేవను ప్రారంభించి, వారిలో మానవతను పంచి; పెంచి ఆపై దైవసేవను ప్రారంభించి వారినందరిని దేవునికి స్వంతము చేసాడు. నిజముగా ఆత్మల భారము గలవారిలాగే శ్రమించి ఆత్మలాధాయము చేసెదరు. ఆర్ధికముపైనే గురినిలిపిన వారు ఆత్మలను ఎంతమాత్రము పట్టించుకోలేరు. చివరి దినములలో మనమందరము ఆర్ధిక భారముతో కాక ఆత్మల భారముతో ముందుకెళ్లుదము. దేవుడు అట్టివారిని దీవించును గాక!

## పాస్టర్లు తమ పరిచర్య నుండి వైదొలగాలని ఆలోచిస్తున్నట్లు సర్వేలో వెల్లడి



(సువార్త ప్రతినిధి): ఒక కొత్త సర్వే ప్రకారం, యునైటెడ్ స్టేట్స్‌లోని ప్రతి ఐదుగురు పాస్టర్లలో నలుగురికంటే ఎక్కువ మంది గత ఐదేళ్లలో తమ పాస్టర్ వృత్తిని విడిచిపెట్టాలని ఆలోచించారు. 1,000 మంది పాస్టర్లను సర్వే చేసిన 'కల్చర్ రిసరెక్షన్ ఇండెక్స్' ప్రకారం, 82% మంది పాస్టర్లు తమ పరిచర్య నుండి తప్పుకోవడం గురించి ఆలోచించినట్లు తేలింది. పదవిని విడిచిపెట్టాలని ఆలోచించిన వారిలో, 74% మంది చర్చి సంస్కృతిలోని సమస్యలే అతిపెద్ద కారణమని చెప్పారు. నాయకత్వం, సిబ్బంది సంబంధాలు మరియు సంస్థాగత సంస్కృతికి సంబంధించిన ఇబ్బందులు వీటిలో ఉన్నాయి.కష్టమైన అభిప్రాయాన్ని సమర్థవంతంగా ఎలా తెలియజేయాలనే దానిపై 63% మంది పాస్టర్లు ఎప్పుడూ శిక్షణ పొందలేదని కూడా ఈ సర్వేలో తేలింది.అదే సమయంలో, నాయకులు తమ చర్చిలలో ఆరోగ్యకరమైన సంస్కృతిని ఎలా పెంపొందించగలరనే దానిపై మరింత శిక్షణకు తాము విలువ ఇచ్చి ఉ ండేవాళ్లమని 77% మంది చెప్పారు.ఈ పరిశోధనను వర్జీనియా పాస్టర్ మరియు నాయకత్వ శిక్షకుడు జారెడ్ ఫాబాక్ చేయించారు. ఆయన ఇలా అన్నారు: "పాస్టర్లు తమ విశ్వాసాన్ని కోల్పోయినందువల్ల వెళ్ళిపోవడం లేదు. విచ్ఛిన్నమైన సిబ్బందికి ఎలా నాయకత్వం వహించాలో, కష్టమైన సమావేశాన్ని ఎలా నిర్వహించాలో, లేదా ఆరోగ్యకరమైన సంస్కృతికి ఆదర్శంగా ఎలా నిలవాలో ఎవరూ వారికి నేర్పనందువల్ల వారు వెళ్ళిపోతున్నారు. సెమినరీ ఉపన్యాసానికి శిక్షణ ఇస్తుంది. అది వ్యవస్థకు అరుదుగా శిక్షణ ఇస్తుంది."మత గురువులలో అధిక పనిభారం, సంఘర్షణ మరియు శ్రేయస్సుపై విస్తృత ఆందోళనల మధ్య ఈ పరిశోధన ఫలితాలు వెలువడ్డాయి. బార్నా గ్రూప్ చేసిన పరిశోధనలో, అమెరికాలోని 52% మంది ప్రొటెస్టంట్ సీనియర్ పాస్టర్లు తమ మానసిక మరియు శారీరక ఆరోగ్యం విషయంలోనే తమకు అత్యంత మద్దతు అవసరమని చెప్పినట్లు కనుగొనబడింది. ఇంగ్లాండ్‌లోని మత గురువులలో కూడా ఇలాంటి ఒత్తిళ్లే ఉన్నట్లు నివేదించబడింది. చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్ పరిశోధనలో అధిక పనిభారం, ఒంటరితనం, తక్కువ మనోధైర్యం మరియు ఆర్థిక ఒత్తిళ్లతో సహా పలు ఆందోళనలు వెలుగులోకి వచ్చాయి.అయినప్పటికీ, సర్వేలో పాల్గొన్న మతగురువులలో 72 శాతం మంది, తాము పరిచర్య ద్వారా తమ పిలుపును నెరవేరుస్తున్నామని నమ్ముతున్నట్లు చెప్పారు.

# నేనే




## యోహాను సువార్తలోని 7 "నేనే" ప్రకటనలు

(సువార్త ప్రతినిధి): పరిచయం: పాత నిబంధనలో దేవుడు మోషేకు తనను తాను "నేనే ఉన్నవాడను అనువాడను" అని పరిచయం చేసుకున్నారు (నిర్గమకాం డము 3:14). యేసుక్రీస్తు యోహాను సువార్తలో అదే "నేనే" అనే పదాన్ని వాడుతూ, తాను కేవలం ఒక ప్రవక్తను మాత్రమే కాదు, సాక్షాత్తు దేవుడనని నిరూపించుకున్నారు.

1. నేనే జీవాహారము

వాక్యము: "యేసు వారితో ఇట్లనెను---జీవాహారము నేనే; నాయొద్దకు వచ్చువాడు ఏమాత్రమును ఆకలిగొనడు." (యోహాను 6:35).

ఇశ్రాయేలీయులు అరణ్యంలో తిన్న 'మన్నా' తాత్కాలిక తృప్తిని ఇచ్చింది, కానీ వారు చనిపోయారు. యేసు ఇచ్చే ఆహారము నిత్యజీవాన్ని ఇస్తుంది. శరీరానికి ఆహారం ఎలా శక్తినిస్తుందో, ఆత్మకు యేసు అలాగే జీవాన్ని ఇస్తారు. ఆయనను భుజించుట అంటే ఆయనను విశ్వసించుట. (యోహాను 6:48-51).

2. నేనే లోకమునకు వెలుగును

వాక్యము: "నేనే లోకమునకు వెలుగును, నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు కలిగియుండును." (యోహాను 8:12).

చీకటి పాపానికి, అజ్ఞానానికి సాదృశ్యం. వెలుగు సత్యానికి, పరిశుద్ధతకు సాదృశ్యం. వెలుగు లేని చోట జీవం ఉండదు. క్రీస్తు మన హృదయాలలోకి వచ్చినప్పుడు మనలోని అంధకారం తొలగిపోయి, దేవుని మార్గం మనకు కనిపిస్తుంది. (1 యోహాను 1:5, కీర్తనలు 119:105).

3. నేనే గొర్రెలకు ద్వారమును

వాక్యము: "నేనే ద్వారమును; నా ద్వారా ఎవడైన లోపల ప్రవేశించిన యెడల వాడు రక్షింపబడినవాడై, లోపలికి వెళ్లుచు బయటికి వచ్చుచు మేత కనుగొనును." (ఆధారము: యోహాను 10:9).

పూర్వ కాలంలో గొర్రెల కాపరి గొర్రెల దొడ్డికి తానే ద్వారముగా పడుకునేవాడు. యేసు తప్ప పరలోక రాజ్యానికి మరో మార్గం లేదు. ఆయన ద్వారానే మనకు రక్షణ మరియు ఆత్మీయ పోషణ లభిస్తాయి. (అపొస్తలుల కార్యములు 4:12).

4. నేనే మంచి కాపరిని

వాక్యము: "నేనే మంచి కాపరిని; మంచి కాపరి గొర్రెల కొరకు తన ప్రాణము పెట్టును." (యోహాను 10:11).

కూలివాడు ప్రమాదం వస్తే పారిపోతాడు, కానీ మంచి కాపరి గొర్రెలను రక్షించడానికి తన ప్రాణాన్ని అర్పిస్తాడు. యేసు మన కొరకు సిలువపై తన ప్రాణాన్ని పెట్టి, మనం అపవాది చేతికి చిక్కకుండా రక్షించారు.
(కీర్తనలు 23:1, హెబ్రీయులకు 13:20).

5. పునరుత్థానమును జీవమును నేనే

వాక్యము: "పునరుత్థానమును జీవమును నేనే; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును." (యోహాను 11:25).

లాజరు మరణించినప్పుడు యేసు ఈ మాట చెప్పారు. మరణం అనేది విశ్వాసికి ముగింపు కాదు, అది నిత్యజీవానికి ప్రారంభం. క్రీస్తు మరణాన్ని జయించి లేచారు కాబట్టి, ఆయనను నమ్మే మనకు కూడా మరణంపై విజయం ఉంది. (1కొరింథీయులకు 15:55-57).

6. నేనే మార్గమును సత్యమును జీవమును

వాక్యము: "నేనే మార్గమును సత్యమును జీవమును; నా ద్వారానే తప్ప ఎవడును తండ్రియొద్దకు రాడు." (యోహాను 14:6). ఇది అత్యంత శక్తివంతమైన ప్రకటన. లోకంలో అనేక మతాలు ఉండవచ్చు, కానీ దేవుని దగ్గరకు చేర్చే ఏకైక 'మార్గం', మారని 'సత్యం', నిరంతర 'జీవం' యేసు మాత్రమే. (1 తిమోతి 2:5).

7. నేనే నిజమైన ద్రాక్షావల్లిని

వాక్యము: "నేనే నిజమైన ద్రాక్షావల్లిని, నా తండ్రి వ్యవసాయకుడు. మీరు తీగెలు." ( యోహాను 15:1-5).

తీగె ద్రాక్షావల్లిలో ఉంటేనే ఫలిస్తుంది. అలాగే మనం క్రీస్తులో ఉంటేనే ఆత్మ ఫలాలను ఫలించగలము. ఆయనను విడిచి మనం ఏమీ చేయలేము. మన ఆత్మీయ ఎదుగుదల ఆయనపై ఆధారపడి ఉంది. (గలతీయులకు 5:22-23).

సారాంశం

ఈ 7 ప్రకటనలు యేసుక్రీస్తు మనకు ఏమై ఉన్నారో సంపూర్ణంగా వివరిస్తాయి. ఆయన మన ఆకలిని తీర్చే ఆహారం, చీకటిని పోగొట్టే వెలుగు, రక్షణనిచ్చే ద్వారం, నడిపించే కాపరి, మరణాన్ని జయించే జీవం, పరలోకానికి చేర్చే మార్గం, మరియు మనల్ని ఫలింపజేసే మూలం. (కొలొస్సయులకు 2:9-10).

# పెరుగు తింటే మంచిదా లేదా మజ్జిగ తాగితే మంచిదా



shutterstock.com · 2461148675

(సువార్త ప్రతినిధి): ఆరోగ్య ప్రయోజనాల పరంగా పెరుగు తింటే మంచిదా లేదా మజ్జిగ తాగితే మంచిదా అనే సందేహం చాలామందిలో నిరంతరం తలెత్తుతుంటుంది. మన నిత్య జీవితంలో ఉండే శారీరక శ్రమ, అవసరాలను బట్టి వీటిని ఎంచుకోవడం ముఖ్యం. ఈ రెండింట్లో కూడా శరీరానికి ఎంతగానో మేలు చేసే ప్రోబయాటిక్స్ బ్యాక్టీరియా పుష్కలంగా లభిస్తాయి. మన రోజువారీ సాంప్రదాయ ఆహారంలో పెరుగు, మజ్జిగలకు అత్యంత ముఖ్యమైన స్థానం ఉంది. పూర్వీకుల కాలం నుండి ఈ రెండు పదార్థాలను జీర్ణక్రియను మెరుగుపరిచే సహజసిద్ధమైన ఔషధాలుగా భావిస్తూ వస్తున్నారు. పెరుగులో ఉండే లాక్టోబాసిల్లస్ వంటి సజీవ క్రియాశీల బ్యాక్టీరియా పేగుల్లో హానికర క్రిములను నశింపజేస్తుంది. ఇది పేగుల కదలికలను క్రమబద్ధీకరించి, జీర్ణక్రియ సులభంగా సాగడానికి దోహదపడుతుంది. క్రమం తప్పకుండా సహజమైన పెరుగును తీసుకోవడం వల్ల శరీరంలో సహజ రోగనిరోధక శక్తి గణనీయంగా పెరుగుతుంది. తరచూ మలబద్ధకం సమస్యతో బాధపడేవారినికి పెరుగు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తుందని వైద్య నిపుణులు స్పష్టం చేస్తోన్నారు. సాధారణ మజ్జిగతో పోల్చి చూస్తే పెరుగులో ప్రోటీన్ల శాతం చాలా ఎక్కువగా ఉంటుంది. కండరాల బలానికి, శరీర ధృఢత్వానికి అలాగే దెబ్బతిన్న కణజాలాల వేగవంతమైన మరమ్మతుకు ప్రోటీన్లు అత్యవసరం. పెరుగు తిన్న తర్వాత కడుపు నిండిన అనుభూతి ఎక్కువ సమయం పాటు ఉంటుంది. దీనివల్ల మధ్య మధ్యలో అనవసరమైన ఆకలి నియంత్రణలోకి వస్తుంది. బరువు తగ్గాలనుకుంటునే వారికి మజ్జిగ అత్యుత్తమం. ఇందులో కొవ్వు, క్యాలరీల శాతం చాలా తక్కువగా ఉంటుంది. శరీర బరువును సులభంగా నియంత్రణలో ఉంచడానికి, పేరుకుపోయిన అధిక వేడిని తగ్గించడానికి మజ్జిగ తోడ్పడుతుంది. శరీరానికి ఎక్కువ ప్రోటీన్లు, ఎముకలను దృఢపరిచే కాల్షియం అవసరమైతే మాత్రం రోజువారీ ఆహారంలో పెరుగును చేర్చుకోవాలి. ముఖ్యంగా పిల్లల ఎదుగుదలకు, దంతాల ఆరోగ్యానికి పెరుగు ఎంతో శ్రేయస్కరం.

# 2027 ఎన్నికలకు ముందు నైజీరియా క్రైస్తవ, ముస్లిం నాయకులు శాంతి ఒప్పందం



(సువార్త ప్రతినిధి): దేశం అందరి దృష్టినీ ఆకర్షించే 2027 ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో, మత సామరస్యాన్ని ప్రోత్సహించడం, విద్వేష ప్రసంగాలను మరియు తీవ్రవాదాన్ని ఎదుర్కోవడం లక్ష్యంగా నైజీరియాలోని 50 మందికి పైగా క్రైస్తవ మరియు ముస్లిం నాయకులు ఒక శాంతి ఒప్పందంపై సంతకాలు చేశారు. సౌదీకి చెందిన ముస్లిం వరల్డ్ లీగ్ ఆధ్వర్యంలో అబుజాలో ఆగస్టు 13న ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఇది నైజీరియా వ్యాప్తంగా క్రైస్తవులు మరియు ముస్లింల మధ్య సహకారాన్ని ప్రోత్సహించే ఉద్దేశ్యంతో ఒక కొత్త అంతర్-మత సంస్థను కూడా ప్రారంభించింది. సంవత్సరాలుగా కొనసాగుతున్న హింస మరియు రాజకీయ విభజనల కారణంగా మతపరమైన ఉద్రిక్తతలు పెరిగిన నైజీరియాకు ఇది ఒక సున్నితమైన సమయంలో కుదిరింది. దేశంలో ఉత్తర ప్రాంతంలో ముస్లింలు అధికంగా ఉండగా, దక్షిణ ప్రాంతంలో క్రైస్తవులు అధిక సంఖ్యలో ఉన్నారు, అయినప్పటికీ రెండు మతాల వారు దేశవ్యాప్తంగా కనిపిస్తారు. ఈ ఒప్పందం మత నాయకుల మధ్య విద్వేషపూరిత ప్రసంగాలను తగ్గించడంలో సహాయపడుతుందని నార్తర్న్ క్రిస్టియన్ రిలిజియస్ లీడర్స్ అసెంబ్లీ ఛైర్మన్ జాన్ ప్రైజ్ డేనియల్ అన్నారు. "విద్వేషపూరిత ప్రసంగాలు ఉండవు, ఇతర మత సమూహాలను అగౌరవపరచడం ఉండదు, ప్రజలను అవిశ్వాసులు అని పిలవడం ఉండదు," అని డేనియల్ అన్నారు. జమాతు నస్రీ ఇస్లాం ప్రధాన కార్యదర్శి ఖాలిద్ అబూబకర్ మాట్లాడుతూ, ఈ ఒప్పందం ఏ వర్గం యొక్క మత గుర్తింపును బలహీనపరిచే ఉద్దేశ్యంతో జరగలేదని అన్నారు. "ఇది మీ సొంత మతాన్ని విడిచిపెట్టమని పిలుపు కాదు, సామరస్యంగా కలిసి పనిచేయడానికి చేసే సహకారం," అని ఆయన అన్నారు. ముస్లిం వరల్డ్ లీగ్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అల్-ఇస్సా మాట్లాడుతూ, ఈ చొరవ మత నాయకులు విభజనను అధిగమించడానికి సిద్ధంగా ఉన్నారని ప్రతిబింబిస్తోందని అన్నారు. "తీవ్రవాద భావజాలం అందరికీ హాని చేసిందన్న విషయాన్ని మేము కాదనడం లేదు; దానివల్ల అందరూ ప్రభావితులయ్యారు," అని అల్-ఇస్సా అన్నారు.

# ఐరోపాలోనే అత్యంత ఎత్తైన వర్జిన్ మేరీ విగ్రహాన్ని ఆవిష్కరించిన పోలాండ్



(సువార్త ప్రతినిధి): పోలాండ్‌లోని కోనోటోపీ అనే గ్రామీణ గ్రామంలో, ఐరోపాలోనే మేరీ మాత యొక్క అత్యంత ఎత్తైన ప్రతిరూపంగా భావిస్తున్న 182 అడుగుల ఎత్తైన కన్య మేరీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ధన్య కన్య మేరీ స్వర్గారోహణ పండుగతో ఏకీభవించిన శనివారం నాడు జరిగిన ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వందలాది మంది ప్రజలు హాజరయ్యారు. ఈ విగ్రహం 15 మీటర్ల ఎత్తైన, కిరీటం ఆకారంలో ఉన్న పీఠంపై నిలబడి ఉంది, ఇందులో సందర్శకుల కోసం ఒక వీక్షణా వేదిక కూడా ఉంది. 182 అడుగుల (55.6 మీటర్ల) ఎత్తుతో, ఇది రియో డి జెనీరోలోని 'క్రీస్తు ది రిడీమర్' విగ్రహం కంటే పొడవైనది. దాని పీఠంతో కలిపి ఆ విగ్రహం 38 మీటర్ల ఎత్తు ఉంటుంది. ఇది పోలాండ్‌లోని స్వీబోడ్జిన్‌లో ఉన్న 'క్రీస్తు రాజు' స్మారక చిహ్నాన్ని కూడా మించిపోయింది, దాని దిబ్బతో కలిపి ఆ విగ్రహం 52.5 మీటర్ల ఎత్తు ఉంటుంది. ఫిలిప్పీన్స్‌లోని 98 మీటర్ల వర్జిన్ మేరీ విగ్రహం దీనికంటే పొడవైనదిగా ఉన్నప్పటికీ, ఐరోపాలో ఈ రకమైన వాటిలో పోలాండ్‌లోని ఈ స్మారక చిహ్నమే అతిపెద్దదిగా భావిస్తున్నారు. ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించిన బిషప్ క్రిస్టోఫ్ వెట్కోవ్స్కీ మాట్లాడుతూ, "చాలా మంది సమకాలీన ప్రజలు తమపై దృష్టి కేంద్రీకరించి, కేవలం భూమి వైపే చూస్తున్నారు" అని, అయితే ఈ విగ్రహం "మన దృష్టిని పైకి దేవుడు మరియు స్వర్గం వైపు మళ్లించమని" ప్రజలను ప్రోత్సహిస్తుందని అన్నారు. కొనో టోపీకి కొన్ని మైళ్ల దూరంలో ఒక చిన్న రాజభవనంలో నివసించే వ్యాపారవేత్త రోమన్ కార్కోసిక్ మరియు అతని భార్య గ్రాజినా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. కార్కోసిక్ తన సంపదను వ్యాపారం మరియు వార్సా స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో పెట్టుబడుల ద్వారా సంపాదించారు. దేవుని పట్ల తమ కృతజ్ఞతకు చిహ్నంగా ఈ స్మారక చిహ్నాన్ని నిర్మించినట్లు ఆ దంపతులు తెలిపారు.

# స్కాట్లాండ్‌లోని చారిత్రక చర్చిలను మరమ్మతు సంక్షోభం నుండి కాపాడటానికి 1 మిలియన్ నిధిని ప్రకటన.



(సువార్త ప్రతినిధి): దేశంలోని జాబితాలో ఉన్న మతపరమైన భవనాల మరమ్మతుల ఖర్చును భరించడానికి 1 మిలియన్ అందుబాటులో ఉంచుతామన్న ప్రకటనను స్కాట్లాండ్‌లోని చర్చి నాయకులు స్వాగతించారు. ఏ మత సమూహం లేదా వర్గానికి చెందిన సంఘాలకైనా మరమ్మతు పనులకు సంబంధించిన వ్యాట్ ఖర్చులను తిరిగి పొందేందుకు సహాయపడటానికి, 'స్కాట్లాండ్ ప్లేసెస్ ఆఫ్ వర్షిప్ ఫండ్' అక్టోబర్ 2026లో ప్రారంభమవుతుంది. ఈ సంవత్సరం ప్రారంభంలో, మత సమాజాలలో తీవ్ర ప్రకంపనలు సృష్టించిన యూకే-వ్యాప్త 'లిస్టెడ్ ప్లేసెస్ ఆఫ్ వర్షిప్ గ్రాంట్ స్కీమ్' ముగింపు తర్వాత ఈ పైలట్ పథకం ప్రారంభించబడింది. ఆ పథకం, ఇటీవలి సంవత్సరాలలో స్కాట్లాండ్‌లోని జాబితాలో ఉన్న ప్రార్థనా స్థలాలకు 2 మిలియన్లకు పైగా ఖర్చు ఆదా చేయడానికి వీలు కల్పించింది. స్కాటిష్ చర్చ్ లీడర్స్ ఫోరమ్ మరియు స్కాటిష్ చర్చ్ కమిటీ, ఆ పథకాన్ని మూసివేసే ముందు సంప్రదింపులు జరపకపోవడం పట్ల యూకే ప్రభుత్వానికి నిరాశను వ్యక్తం చేశాయి. అలాగే, ఈ నిర్ణయం వల్ల జాబితాలో ఉన్న ప్రార్థనా స్థలాలు అసమానంగా ప్రభావితం కాకుండా చూడాలని స్కాటిష్ ప్రభుత్వాన్ని కోరాయి.


సంఘాలపై ఉన్న ఆర్థిక ఒత్తిడిని తగ్గించడానికి ఒక ప్రత్యామ్నాయ పథకాన్ని ప్రారంభించాల్సిన ఆవశ్యకత గురించి స్కాటిష్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ, తమ స్థానిక ఎన్నికైన ప్రతినిధులకు లేఖలు రాయాలని చర్చి సభ్యులను కోరారు. ఈ కొత్త నిధులు ఇప్పటికే ఉన్న హిస్టారిక్ ఎన్విరాన్‌మెంట్ స్కాట్లాండ్ గ్రాంట్ల బడ్జెట్ ద్వారా అందుబాటులోకి వస్తాయి మరియు ఇది ఒక స్వతంత్ర పథకం. చర్చ్ ఆఫ్ స్కాట్లాండ్ జనరల్ అసెంబ్లీ మోడరేటర్ అయిన రైట్ రెవరెండ్ గోర్డాన్ కెన్నెడీ మాట్లాడుతూ, సమాజ జీవితానికి కేంద్రబిందువైన చారిత్రాత్మక ప్రాముఖ్యత కలిగిన ఆస్తులను నిర్వహించడానికి ఈ డబ్బు ఎంతో అవసరమైన మద్దతును అందిస్తుందని అన్నారు. "సంఘ సభ్యులే కాకుండా ఇతరులు కూడా ఎంతో ఇష్టపడే ప్రార్థనా స్థలాల ప్రాముఖ్యతను గుర్తించినందుకు, ఎజూరా మరియు స్కాటిష్ ప్రభుత్వం అందిస్తున్న మద్దతుకు నేను చాలా కృతజ్ఞుడను," అని ఆయన అన్నారు. తమ ప్రార్థనా స్థలాలను కోల్పోవడం సమాజాలకు ఎంత కష్టమో మాకు తెలుసు. మరమ్మతులు మరియు నిర్వహణకు మద్దతు ఇవ్వడం వల్ల మరిన్ని ప్రదేశాలు వెచ్చగా, గాలి, నీరు చొరబడకుండా ఉండేలా చేయవచ్చు. అంతేకాకుండా, ఈ చారిత్రక ఆస్తులను సంరక్షించడానికి స్థానిక స్వచ్ఛంద కార్యకర్తలకు ఇది మరింత సులభతరం చేస్తుంది."వివిధ మత సమూహాల ఉమ్మడి ఆందోళన, మరియు అన్ని పార్టీల రాజకీయ నాయకుల ఆసక్తి, మద్దతు నిజంగా ప్రశంసనీయం. గత కొన్ని నెలలుగా ఈ విషయంపై తమ ఎన్నికైన ప్రతినిధులను సంప్రదించిన ప్రతి ఒక్కరికీ నేను ధన్యవాదాలు తెలియజేయాలనుకుంటున్నాను. "మీ గళం నిజమైన మార్పును తీసుకువచ్చింది."

స్కాట్లాండ్ కాథలిక్ బిషప్స్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు, రైట్ రెవరెండ్ జాన్ కీనన్ ఇలా అన్నారు: "స్కాట్లాండ్ వారసత్వానికి మరియు సామాజిక జీవితానికి చర్చిలు, ఇతర ప్రార్థనా స్థలాలు అందించే కీలకమైన సహకారాన్ని గుర్తించే 'స్కాట్లాండ్ కోసం ప్రార్థనా స్థలాల నిధి' పైలట్ ప్రాజెక్ట్‌పై హిస్టారిక్ ఎన్విరాన్‌మెంట్ స్కాట్లాండ్ చేసిన ప్రకటనను మేము హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నాము.

"గతంలో యూకే వ్యాప్తంగా అమలు చేసిన పథకం విఫలమైన లోటును పూడ్చడానికి, ఈ నిధి ఈ ముఖ్యమైన భవనాల సంరక్షణ మరియు పరిరక్షణకు ఎంతో అవసరమైన మద్దతును అందిస్తుంది."

ఈ పైలట్ ప్రాజెక్ట్ పురోగమిస్తున్న కొద్దీ, హిస్టారిక్ ఎన్విరాన్‌మెంట్ స్కాట్లాండ్ మరియు స్కాటిష్ ప్రభుత్వంతో నిర్మాణాత్మకంగా కలిసి పనిచేయడానికి, అలాగే భవిష్యత్తు కోసం ఒక శాశ్వత, స్థిరమైన నిధుల ఏర్పాటుపై చర్చలు జరపడానికి మేము ఎదురుచూస్తున్నాము. అర్హులైన దరఖాస్తుదారులకు, ముందు వచ్చిన వారికి ముందు అనే ప్రాతిపదికన నిధులు కేటాయించబడతాయి.

# మరో 13 మంది క్రైస్తవ నాయకులపై దాడులకు కుట్ర పన్నిన పాస్టర్ హంతకుడికి జీవిత ఖైదు



(సువార్త ప్రతినిధి): అరిజోనా పాస్టర్‌ను హత్య చేసి, అమెరికా వ్యాప్తంగా ఇతర క్రైస్తవ నాయకులను చంపడానికి ప్రణాళిక వేసిన ఒక వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష విధించబడింది. మారికోపా కౌంటీ అటార్నీ కార్యాలయం ప్రకారం, "పాస్టర్ బిల్"గా పిలువబడే 76 ఏళ్ల విలియం షోనెమాన్ హత్య మరియు పలు ఇతర నేరాలకు గాను ఆడమ్ షీఫ్‌కు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు అదనంగా 102 సంవత్సరాల జైలు శిక్ష విధించబడింది. న్యూ రివర్ బైబిల్ ఛాపెల్ పాస్టర్ అయిన షోనెమాన్, ఏప్రిల్ 2025లో తన ఇంట్లో శవమై కనిపించారు. అరిజోనాస్ ఫ్యామిలీ ప్రకారం, షోనెమాన్‌ను చంపి, అతని తలపై ముళ్ల కిరీటాన్ని పెట్టడంతో సహా, అతని శరీరాన్ని శిలువ వేసినట్లుగా అమర్చినట్లు షీఫ్ అంగీకరించాడు. షోనెమాన్‌ను వరుస బాధితులలో మొదటి వ్యక్తిగా లక్ష్యంగా చేసుకున్నట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో తాను దాడి చేయాలనుకున్న మరో 13 మంది క్రైస్తవ నాయకులను కూడా షీఫ్ గుర్తించాడు. పాస్టర్ మృతదేహం దొరికిన రెండు రోజుల తర్వాత అతడిని అదుపులోకి తీసుకున్నారు. అరిజోనాస్ ఫ్యామిలీతో జైలులో జరిపిన ఒక ఇంటర్వ్యూలో షీఫ్ ఇలా అన్నాడు: "మతగురువులను లేదా మందను తప్పుదారి పట్టిస్తున్న కాపరులను తప్ప మరెవరినీ చంపడంలో నాకు ఆసక్తి లేదు." నెవాడా, ఒరెగాన్, వాషింగ్టన్, మోంటానా, మిచిగాన్, న్యూయార్క్, నార్త్ కరోలినా, అలబామా మరియు టెక్సాస్‌తో సహా పలు రాష్ట్రాలను లక్ష్యంగా చేసుకుని, దేశవ్యాప్తంగా పర్యటించి మరిన్ని దాడులు చేయాలని అతను ఉద్దేశించాడు. జూన్‌లో ఒక న్యాయమూర్తి ఆమోదించిన ఒప్పందం ప్రకారం షీఫ్ తనపై మోపిన ఆరోపణలను అంగీకరించాడు, దీనివల్ల మరణశిక్ష పడే అవకాశం తొలగిపోయింది. షోనెమాన్ హత్యకు విధించిన యావజ్జీవ కారాగార శిక్షతో పాటు, హత్యాయత్నంతో సహా ఇతర నేరాలకు కూడా న్యాయమూర్తి వరుస శిక్షలను విధించారు. శిక్ష విధించడానికి ముందు షోనెమాన్ కుటుంబ సభ్యులు, స్నేహితులు కోర్టును ఉద్దేశించి మాట్లాడారు.

Printer, publisher, Editer and owend by Chatla Luthar Prasanth Kumar,Publishing from 15-7, Chalapadu, Chebrole (M), Guntur-522124, Printed at Suvartha printers, Chalapadu (V"Chebrole (M),Guntur.Ap.
Editor Chatla Luthar Prasanth Kumar,E-mail news@suvaartha.com (M)888 66 123 28